


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 225 | కర్నూలు | శనివారం సెప్టెంబర్ 13 2025 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi





## రానున్న దశాబ్దకాలంలో మారనున్నరూపురేఖలు

**ఖఠిన చర్యలతో అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నాం**
**స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంతో అభివృద్ధి ప్రణాళికలు**
**అమరావతిలో నిర్వహించినకాన్‌క్లేవ్‌లో చంద్రబాబు**




అమరావతి,సెప్టెంబర్12(శ్రీచక్ర) :భారతదేశానికి నాలుగోసారీ ప్రధానిగా నరేంద్రమోదీనే ఉంటారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. వచ్చే దశాబ్దంలో ఏపీతోపాటు, దేశంలో అద్భుతాలు జరుగు తాయని ఆయన అన్నారు. ఒక సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయనే అంశాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నా. 1999లో గెలిచా. 1999 ప్రభుత్వం వచ్చాక ఓ తపనతో పని చేశా. కొంచెం బ్యాలెన్స్ చేయలేకపోయాం. కానీ ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టిస్తున్నాం.. పేదలకు అందిస్తున్నాం. భారత ప్రధానిగా నాలుగోసారి కూడా మోదీనే వస్తారు. రాష్ట్రంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వమే వస్తుంది. ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు అని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఏపీలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం అని సీఎం చంద్రబాబు అన్నారు. విజన్ రూపకల్పన చేయడమే కాదు.. దాన్ని సాధ్యం చేసే దిశగా పని చేయాలని ఆయన సూచించారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్-2047, రాష్ట్ర స్థాయిలో స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్లను సిద్ధం చేశామని తెలిపారు. భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్ స్టాపబుల్ గా మారింది. 2038 నాటికి భారతదేశం నెంబర్-1 అవుతుంది. ఇందులో తెలుగు వారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నానని అన్నారు.




## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

**రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము**
**హాజరైన ప్రధాని మోడీ, పలువురు ప్రముఖులు**

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(శ్రీచక్ర) భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు-, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏపీ డిప్యూటీ-సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, మాజీ ఉప రాష్ట్రపతులనూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు, హమీద్ అన్సారీ తదితరులు కూడా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఎన్డీయే కూటమికి చెందిన నేతలు, ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఉప



రాష్ట్రపతి ఎన్నికకు ఈనెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక లాంఛనాలన్నీ పూర్తి కావడంతో గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. దీంతో మహారాష్ట్ర బాధ్యతలను గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాష్ట్రపతి ముర్ము అప్పగించారు. ఆర్‌ఎస్‌ఎస్, జన్‌సంఘ్ లాంటి సంస్థలతో 16 ఏండ్లకే రాధాకృష్ణన్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా, 2003 నుంచి 2006 మధ్య అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన రాష్ట్రంలో 93 రోజుల పాటు 19 వేల కి.మీ రథయాత్ర నిర్వహించారు. 2024, జూలై 31న ఆయన మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జార్ఖండ్ గవర్నర్‌గా ఏడాదిన్నర పాటు చేశారు.

## ఏపీలో ఎన్‌ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటు యోచన

**తెలుగు సినిమా గ్లోబల్ అవుతోందన్న పవన్ కళ్యాణ్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(శ్రీచక్ర) తెలుగు సినిమా ఇప్పుడు గ్లోబల్ సినిమా అవుతోందని ఏపీ ఉప ముఖ్యమంత్రి, సినీనటు-డు పవన్ కల్యాణ్ అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్‌ఎస్‌డీ) కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌ఎస్‌డీని చూస్తే మినీ ఇండియాలా దర్శనమిస్తోందని చెప్పారు. తనకు నటన నేర్పిన సత్యానంద్ ఎస్‌ఎస్‌డీ గురించి గొప్పగా చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. కళలు లేకపోతే సమాజంలో హింస ప్రబలుతుందని వ్యాఖ్యానించారు. ఏపీలో ఎన్‌ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటు- చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. క్యాంపస్ ఏర్పాటు-పై సీఎం చంద్రబాబుతో చర్చిస్తానని తెలిపారు.



## మెడికల్ కాలేజీలు కట్టకుండానే ప్రచారం

**జగన్ హయాంలో వైద్య విద్య మరీ అధ్వానం**
**పిపిపి పద్దతిలోనే కళాశాలల నిర్వహణ**
**తేల్చి చెప్పిన సిఎం చంద్రబాబు**
**జగన్ హయాంలో నిర్లక్ష్యంపై మండిపడ్డ అనిత**
**టెండర్లను రద్దుచేసే అధికారం లేదన్న సత్యకుమార్**

అమరావతి,సెప్టెంబర్12(శ్రీచక్ర) :జగన్ మెడికల్ కాలేజీలు కట్టకుండా... కట్టేశామని చెబుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేశారు. తాము ప్రైవేట్ వారికి అప్పగించడం లేదని .. పీపీపీ పద్ధతిలోనే చేపడుతున్నామన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని, నిర్వహణ ప్రభుత్వానిదేనని తేల్చి చెప్పారు. వైద్య విద్యార్థులకు, వైద్య సేవలకు ఇబ్బంది రాకుండా చేసే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. బెదిరిస్తే బెదిరిపోయే పరిస్థితి లేదని తెలిపారు. ఒకప్పుడు రాయలసీమలో పదేళ్లలో 8 ఏళ్లు కరవు ఉండేదన్నారు. దేశంలో ఇప్పటికీ అతి తక్కువ వర్షపాతం ఉన్న జిల్లా అనంతపురం.. కానీ నీళ్లు ఇవ్వడంతో అక్కడ పరిస్థితి మారిందన్నారు. గోదావరి జిల్లాల కంటే అనంతపురం జిల్లానే జీఎన్‌డీపీలో అగ్రస్థానంలో ఉందన్నారు. హార్టీకల్చర్ సాగు వల్లే ఇది సాధ్యమైందని గుర్తు చేశారు. వృథా జలాలను మాత్రమే బనకచర్లకు వినియోగించు



కుంటామని స్పష్టం చేశారు. ఇదిలావుంటే గతంలో జగన్ శంకుస్థాపన చేసిన వైద్య కళాశాలలన్నీ పునాదుల దశలోనే ఉన్నాయని, మొండి గోడల మధ్య వైద్య విద్యార్థులు చదువుకుంటారా? అని ఏపీ హోం మంత్రి అనిత మండిపడ్డారు. పునాదుల దశలోనే వైద్య కళాశాలలు ఉంటే.. అడ్మిషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. విజయవాడలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో.. మెడికల్ కాలేజీలపై వైకాపా నేతలు చేస్తున్న విమర్శలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత వైకాపా ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. నోటికొచ్చినట్లు- జగన్ అబద్ధాలు చెబుతున్నారు. వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.5,800 కోట్లు- అవసరం.

## తురకపాలెం సమస్యలపై ప్రత్యేక దృష్టి

**పరీక్షల నివేదికలు రాగానే చర్యలు**
**న్యూ రాజరాజేశ్వరి పేటలో అదుపులోడయేరియా**
**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్**



విజయవాడ,సెప్టెంబర్12(ఆర్‌ఎన్‌ఎ):తురకపాలెంలో అనారోగ్య సమస్యలు, పలువురి మృతికి గల కారణాలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. అక్కడి ప్రజలకు అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నామని.. నివేదికలు రాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వంద పడకల ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ కేశినేని చిన్ని, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. డయేరియాపై ఏపీ ప్రభుత్వ పరంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## సూపర్ సిక్స్‌లో 90 శాతం అమలు

**ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అమలుచేసి చూపాం**
**పురపాలక శాఖమంత్రి నారాయణ వెల్లడి**




విజయవాడ,సెప్టెంబర్12(శ్రీచక్ర) సూపర్ సిక్స్‌లో 90 శాతం అమలు చేసేశామని మంత్రి నారాయణ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన డైరెక్టర్లను సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛ భారత్‌కు అనుగుణంగా స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఏర్పా-టైందని తెలిపారు. స్వచ్ఛమైన తాగు నీరు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్రజలకు ఎంతో కీలకమైందని చెప్పారు.రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇప్పటికే సూపర్ సిక్స్‌లో 90 శాతం అమలు చేశామన్నారు. స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు- వివరించారు. 85 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను ఏడాదిలోగా తొలగించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వెల్లడించారు. ఇప్పటివరకూ 81 లక్షల టన్నుల చెత్త తొలగించినట్లు- చెప్పారు. ముఖ్యమంత్రి ఇచ్చిన టార్గెట్ అక్టోబర్ రెండో తేదీకి ముందుగానే 85 లక్షల టన్నుల వేస్ట్‌ను తొలగిస్తామని పేర్కొన్నారు. చంద్రబాబు ఆదేశాలతో మున్సిపాలిటీ-ల్లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. రాష్ట్రంలో 10 వేస్ట్ టు- ఎనర్జీ ఎ÷-లాంట్‌లు ఏర్పాటు- చేయాలని 2014లో నిర్ణయించినట్లు- గుర్తుచేశారు. ఇప్పటికే ఉన్న రెండు ఎ÷-లాంట్లకు అదనంగా త్వరలో కొత్తగా ఆరు ఎ÷-లాంట్ల నిర్మాణాలు ప్రారంభం కానున్నాయని వివరించారు. ఈ ఎ÷-లాంట్లు-అందుబాటు-లోకి వస్తే ప్రతి రోజూ వచ్చే 7000 టన్నుల చెత్తలో 6500 టన్నుల చెత్త విద్యుత్‌గా మారిపోతుందన్నారు. అదే జరిగితే దేశంలోనే ఏపీ నెంబర్ వన్ అవుతుందని చెప్పుకొచ్చారు.రాబోయే మూడేళ్లలో ప్రతి ఇంటి నుంచి వచ్చే నీటిని ట్రీ-ట్‌మెంట్ ఎ÷-లాంట్ల ద్వారా ట్రీ-ట్ చేసి బయటకు పంపిస్తామన్నారు. మున్సిపాలిటీ-లు, పంచాయతీల్లో డ్రైనేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు- పేర్కొన్నారు.

## రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు

**అన్ని రకాల ఎరువులు సరిపడా నిల్వలు**
**మరోమారు స్పష్టం చేసిన అచ్చన్నాయుడు**

విజయవాడ,సెప్టెంబర్12(శ్రీచక్ర) రాష్ట్రంలో ఎరువులకు ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోమారు స్పష్టంచేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. విజయవాడలోని క్యాంప్ ఆఫీస్ లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సహా అన్నిరకాల ఎరువులు సరిపడా నిల్వలుగా ఉన్నాయని తెలిపారు. జిల్లాల వారీగా ఎరువుల నిల్వలను పరిశీలిస్తూ, కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులతో ప్రతిరోజూ సమీక్షలు జరుగుతున్నాయని అన్నారు. మార్కెట్‌లో ఎరువుల కొరత లేకుండా, రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, ఒక్క రైతు కూడా ఇబ్బందులు పడకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే రైతుల సమస్యల పరిష్కారం మా మొదటి కర్తవ్యం అని మంత్రి స్పష్టం చేశారు.



ఎరువుల కొరత పేరుతో రైతులను మోసం చేయాలనుకునే డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అచ్చెన్నాయుడు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులు 24 గంటలు పనిచేస్తున్నారని తెలిపారు.

# సంపాదకీయం

## దేశాన్ని దారిలో పెట్టాల్సిన బాధ్యత యువతదే !

ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో దక్షిణాది నేతలదే హవాగా ఉండేది. ఇప్పుడు అంతగా కనిపించడం లేదు. ముఖ్యంగా తెలుగు వారు జాతీయ రాజకీయాల్లో అరుదుగా ఉన్నారు. క్రమంగా ఒక్కొకరే కనుమరుగు అవుతున్నారు. కొత్త తరం రావాల్సి ఉన్నా రావడంలేదు. యువత రాజకీయాల్లో రాణించాల్సి ఉంది. దేశం అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వేళ కొత్త తరాన్ని ఆహ్వానించాలి. రాజకీయాల్లో కూడా రిజర్వేషన్లు రావాలి. రిజర్వేషన్లు వస్తేనే పదవులు పట్టుకుని వేలాడుతున్న వారి స్థానంలో కొత్త రక్తం వస్తుంది. సర్పంచ్ నుంచి, ఎమ్మెల్యేలు, ఎంపిలకు కాలపరిమితి విధించుకోవాల్సి ఉంది. దేశం మూస పద్దతిలో నడవడం వల్లనే బంగ్లాదేశం, నేపాల్‌లో తిరుగుబాట్లు వచ్చాయి. నేపాల్‌లో యువతే ముందుకు కదిలింది. రాజకీయ స్వార్థంతో తీసుకున్న నిర్ణయాలను నిరసించడం ద్వారా దేశాన్ని కదిలించారు. దేశం ఏదైనా పదవీకాంక్షతో చేస్తున్న రాజకీయాల వల్ల ఆ దేశం పురోగమించడం లేదు. మనదేశంలోనూ ఇలాంటి సమస్యలే ఉన్నాయి. వీటిని నిలదీయాల్సి ఉంది. అందువల్ల యువతరం కొత్త ఆలోచనలతో రాజకీయాల్లో అడుగు పెట్టాల్సి ఉంది. పివి నరసింహారావు, జైపాల్ రెడ్డి, పర్వతనేని ఉపేంద్ర, సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్ రెడ్డి లాంటి నేతల మరణం తరవాత అంతగా ప్రభావితం చేయగలిగిన నేతలు రావడం లేదు. వెంకయ్యానాయుడు పదవీ విరమణ తరవాత రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దీంతో తెలుగువారి పాత్ర అంతకంతకూ కనుమరుగు అవుతోంది. ముఖ్యంగా జాతీయ రాజకీయాల్లో తెలుగు వారి పాత్ర లేకుండా పోతోంది. పూర్వపు ఎన్‌డిఎలో చంద్రబాబు నాయుడు కన్వీనర్‌గా బాగానే రాణించారు. ఒకప్పుడు ప్రధాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన నేతలు ఇప్పుడు అక్కడ కనిపించడం లేదు. చక్రం తిప్పే స్థాయి నుంచి ..ఇప్పుడంతా తెరమరుగు అవుతూ వచ్చారు. గతేడాది సీతారాం ఏచూరి మరణం, మొన్నీ మధ్యనే వయోభారంతో సురవరం సుధాకర్ రెడ్డిల మరణంతో జాతీయస్థాయిలో నిలువగలిగిన నేతలు లేకుండా పోయారు. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఎర్రసూరీడు ఏచూరీ కూడా అస్తమించి ఏడాది కావస్తోంది. ఇంతకాలం ఓ తెలుగు నేత ఉన్నాడన్న ధీమా ఉండేది. చిమ్మ చీకటిలో మిణుమిణుకుమంటూ కనిపించే మిణుగురు పురుగులా సీతారం ఏచూరీ కనిపించేవారు. ఆయన జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఒకప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణ, నీలం సంజీవరెడ్డి, పివి నరసింహారావు, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి ఉద్దండులు జాతీయ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. తరవాత జైపాల్ రెడ్డి, విద్యాసాగర్ రావు, వెంకయ్యానాయుడు, సురవరం సుధాకర్ రెడ్డి, సీతారాం ఏచూరిలు కనిపించేవారు. ఇప్పుడు ఒక్కొక్కరే అదృశ్యమవుతూ వచ్చారు. ఉపరాష్ట్రపతి పదవి విరమణ తరవాత వెంకయ్య నాయుడు కూడా జాతీయ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కరీంనగర్‌కు చెందిన సిహెచ్ విద్యాసాగర్ రావు కూడా గవర్నర్ పదవి తరవాత ఇంటికే పరిమితం అయ్యారు. సురవరం సుధాకర్ రెడ్డి కూడా సిపిఐ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నాక, ఇటీవలే మరణించారు. నిజానికి కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో కొనసాగివుంటే మంచి నేతగా రాణించేవారు. ఆయన కూతురు కవితను జాతీయ రాజీయాల్లో కొనసగించినా ఆమె మంచి పట్టు సాధించేవారు. ఎందుకంటే కవిత మంచి ఇంగ్లీష్, హిందీ, ఉర్దూలలో మాట్లాడగలిగే సత్తా ఉన్న నేత. కానీ కెసిఆర్ ఎందుకనో ఆ వైపుగా ఆలోచించలేదు. ఇవాళ ఆమె ఢిల్లీ రాజకీయాల్లో ఉండివుంటే బిఆర్ఎస్‌కు ఇప్పుడీ దుర్గతి పట్టివుండేది కాదు. కెసిఆర్ స్వార్థ, కుటుంబ రాజకీయాల్లో పడిపోవడం వల్ల తనకున్న అవకాశాలను కోల్పోయారనే చెప్పాలి. తెలంగాణ సాధించిన తరవాత కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టివుటే కెసిఆర్ అద్భుతంగా రాణించే వారు. భాషాపటిమ, వాక్చాతుర్యం కూడా అద్భుతంగా ఉన్న నేతగా కెసిఆర్ దేశ ప్రజలకు సుపరిచితం.కుటుంబ రాజకీయాలతో ఆయన తనకున్న ఇమేజ్‌ను దెబ్బ తీసుకున్నారు. లేకుంటే జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగేవారు. నిబద్ద రాజకీయాలు నడపకుంటే రాణించడం కష్టం. నిజాయితీ కూడా చాలా ముఖ్యం. అది లేకుంటే ఎంతటివారైనా కాల ప్రవాహంలో కొట్టుకు పోతారు. కెసిఆర్ తనయ కవిత కూడా మంచి వక్త. ఎంపిగా ఆమె బాగా రాణించారు. కానీ లిక్కర్ స్కామ్ ఆమె రాజకీయ ప్రస్థానంపై బురద జల్లింది. ఆ మరకను చెరిపేసుకోవడం అసాధ్యం. దీంతో ఆమె కూడా ఇక రాణించడం కష్టం. జాగృతి పేరుతో ఆమె రాజకీయాలు చేస్తున్నా..తెలంగాణలో ఆ కుటుంబం మొత్తం అవినీతి పంకిలంలో మునిగిన కారణంగా వారిని నమమడం కూడా కష్టమే. మొత్తంగా ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో తెలుగువారు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. దీనిని పూడ్చాల్సిన బాధ్యత మనపైనే ఉంది. జాతీయ రాజకీయాల్లో మనపాత్ర లేకుంటే ఉత్తరాది వారి పెత్తనం సాగనుంది. ఇప్పటికే బిజెపిలో కేవలం గుజరాత్ పెత్తనమే సాగుతోంది. దేశంపై వారిద్దరే అజమాయిషీ చెలాయిస్తున్నారు. అమిత్ షాకు ఇంగ్లీష్ అంతగా వచ్చినట్లు ఎక్కడా చూడలేదు. కానీ హోంమంత్రిగా నెట్టుకు వస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో రాణించాలంటే హిందీ, ఆంగ్లంపై పట్టుతో ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాగే దేశ రాజకీయాలను ఔపోసన పట్టాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. వాటిపై పోరాటం చేసే సత్తా ఉండాలి. అప్పుడే రాణించగలరు. తెలుగుదేశం నుంచి కేంద్ర విమానాయన మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్మోహన్ నాయుడు కొంత లోటు పూడ్చే అవకాశాలు లేకపోలేదు. అయితే పార్టీ ఆయనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినప్పుడే ఇది సాధ్యం. ఎందుకంటే రామ్మోహన్ నాయుడు కూడా బాగా చదువుకున్న వాడే కాకుండా యువకుడు. చంద్రబాబు ఆయనకు బాగానే ప్రోత్సాహం ఇస్తున్నారు. ఇంగ్లీష్, హిందీలపై బాగా పట్టు సాధించారు. సమస్యలపై అవగాహన ఉంది. అనర్గళంగా మాట్లాడే స్వభావం ఉంది.

## ద్విచక్ర వాహనాలు దొంగలించే నిందితుడు అరెస్టు

### రూ. 16 లక్షల విలువ చేసే 32 ద్విచక్ర వాహనాలు స్వాధీనం - కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్






కర్నూలు , సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): లక్షల విలువ చేసే 32 ద్విచక్ర వాహనాలు దొంగలించిన నిందితున్ని కర్నూలు రెండవ పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సంధర్భంగా కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్, కర్నూలు టు టౌన్ సిఐ నాగరాజారావు, ఎస్సైలు సతీష్, మల్లికార్జున తో కలిసి కర్నూలు రెండవ పట్టణ పోలీసుస్టేషన్ లో నిందితుని వివరాలను మీడియా సమావేశంలో శుక్రవారం వెల్లడించారు. ఈ సంధర్భంగా కర్నూలు డిఎస్పీ మాట్లాడుతూ కర్నూలు పట్టణంలోని భూపాల్ కాంప్లెక్స్ దగ్గర ఒక బైక్ దొంగలించారని కర్నూలు, లక్ష్మీనగర్ కు చెందిన నిరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారన్నారు. కర్నూలు టు టౌన్ సిఐ , ఎస్సైలు, పోలీసు కానిస్టేబుల్స్ రవి కుమార్, శ్రీనివాసులు, మహేంద్రలు కలిసి ఒక స్పెషల్ టీమ్ గా ఏర్పడి నిందితున్ని పట్టుకోవడాని చర్యలు చేపట్టారన్నారు. రాబడిన సమాచారం మేరకు కర్నూలు- సుంకేశుల రోడ్డు లో ఉన్న రెండు వాగుల వద్ద ఈ రోజు తెలంగాణ రాష్ట్రం, గద్వాల పట్టణం, దౌడురాళ్ళ కాలనీకి చెందిన తెలుగు జయంత్ ఏజస్వంత్ ను అరెస్టు చేసి, అతని నుండి 32 బైక్ (హోండాషైన్ , హీరో హోండా, యూనికార్న్ ) లను రికవరీ చేయడం జరిగిందన్నారు. వీటి విలువ రూ. 16 లక్షల వరకు ఉంటుందన్నారు. రికవరీ చేసిన బైక్ లు పలు పోలీసుస్టేషన్ పరిధులలో కూడా బైక్ దొంగతనాల పై కేసులు నమోదు అయినావన్నారు. ఆయా పోలీసుస్టేషన్ లకు రికవరి చేసిన బైక్ ల గురించిన సమాచారం అందిస్తామన్నారు. వాహనం ఇంజిన్ నెంబర్, బైక్ చాస్ నెంబర్ ద్వారా సంబధించిన బైక్ యజమానులకు బైక్ లు అప్పగిస్తామన్నారు. కర్నూలు టౌన్ లోని పలు జంక్షన్స్ , హాస్పిటల్స్ , రాత్రి ఇళ్ళ దగ్గర పార్కింగ్ చేసిన బైక్ లను నిందితుడు దొంగలించినట్లు గుర్తించామన్నారు.పలు పోలీస్టేషన్ పరిధులలో దొంగలించిన బైక్ లను కూడా రికవరీ చేయడం కర్నూలు టు టౌన్ సిఐని, టు టౌన్ సిబ్బందిని అభినందిస్తున్నామన్నారు. రికవరీ చేసిన బైక్ లను ఆయా పోలీసుస్టేషన్ లలో నమోదైన బైక్ దొంగతనాల కేసుల ఆధారంగా వాటిని పంపించి డిస్పోజబుల్ చేయడం జరుగుతుందన్నారు. సిసి కెమెరాల సహాయంతో ఈ కేసులను సులువుగా చేధించడానికి వీలయిందన్నారు. బైక్ లు రికవరీ చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారన్నారు. నిందితుడు బైక్ ర్యాపిడో బుకింగ్ లో పని చేస్తూ ఉండేవాడు. ఈ బైక్ లను ఎక్కువగా కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాలలో దొంగలించాడు. సులువుగా డబ్బులు సంపదించాలని మోటార్ బైక్ లను దొంగిలించడం వాటిని రూ. 10 వేలు, రూ. 5 వేలకు అమ్మడం చేస్తూ ఉండేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ ఉండేవాడు.

## అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాం

### ధర్వేశ్ ఖాద్రి మసీదును సందర్శించిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్







కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): అన్ని మతాలను తాను సమానంగా గౌరవిస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని పదవ వార్డులో ఆధునికరించిన ధర్వేశ్ ఖాద్రి దర్గాను రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మహబూబ్ ఆధ్వర్యంలో మసీదు కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మసీదులో విద్యను అభ్యసించే విద్యార్థులకు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా సైకిల్స్ ను అందజేశారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మసీదును ఆధునికరించిన నేపథ్యంలో మసీదు కమిటీ ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూల్ నగరంలో కుల, మతాలకు అతీతంగా అందర్నీ కలుపుకొని పోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. అందరినీ కలుపుకొని పోతున్నా... కొందరు తమను కమ్యూనల్ గా ప్రచారం చేస్తారని.. అలా చెప్పిన వారి వ్యాపారాల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఉంటారని చెప్పారు. తమ సంస్థలో అన్ని సామాజిక వర్గాల వారు ఉంటారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, వారి ఆశీస్సులు నిరంతరం తమపై ఉండాలని ఆకాంక్షించారు. తాము అందరినీ కలుపుకొని కర్నూలు అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో అల్లాహ్ దయతో మీరందరూ గత ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి గెలిపించారని, భవిష్యత్తులో ఇదే సహకారం అందించాలని చెప్పారు. మంత్రిగా ఎన్నికై 15 నెలలు గడుస్తుందని ,ఈ 15 నెలల కాలంలో కర్నూల్ నగరంలో ఎలాంటి ఘటనలు జరగకుండా ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలిపారు. తాము సాధ్యమైతే సహకారం అందిస్తామని ఇతరుల మాదిరి మసీదు కమిటీల్లో, ఇతర అంశాల్లో తల దూర్చమని వివరించారు. తాము మొదటి నుంచి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, తమతో ఉన్నవారు కూడా తమ ఆలోచనలను పంచుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. తాము ఎవరికైనా సహాయం చేస్తే అందులో వచ్చిన లాభాలను వారు కూడా సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని, ఇది మంచి పరిణామం అని చెప్పారు. మహబూబ్ ఆధ్వర్యంలో ధర్వేశ్ ఖాద్రి మసీద్ ను చక్కగా ఆధునికరించారని తెలిపారు. అలాగే మహమ్మద్ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ టేకర్ కమిటీ ప్రతినిధులు కూడా చక్కటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, అందులో భాగంగానే ఈ మసీదుకు బాడీ ఫ్రీజర్ బాక్స్ ను అందజేశారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. వక్ఫ్ బోర్డు కాంప్లెక్స్ ను మరింత అభివృద్ధి చేసి పేద ముస్లింలకు సహాయం చేసే విధంగా ముందుకు వెళ్తామని చెప్పారు. అనంతరం మసీదు కమిటీ ప్రతినిధి మహబూబ్ తదితరులు మాట్లాడుతూ కర్నూల్ నగరంలో కుల మతాలకతీతంగా సేవలు అందించడంలో టీజీవి కుటుంబం అందరికీ ఆదర్శప్రాయమని చెప్పారు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గత 15 నెలల కాలంలో కర్నూల్ నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. రానున్న కాలంలో కర్నూలు మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్







తిరుమల,సెప్టెంబర్ 12(శ్రీచక్ర): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు.టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్,అడిషనల్ ఈ ఓ వెంకయ్య చౌదరి,కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి శ్రీవారి చిత్రపటం,తీర్థ ప్రసాదాలు అందజేశారు.సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి కేంద్ర మంత్రి వెంట ఉన్నారు.

## పురుగుల మందు సేవించి మహిళా మృతి



పెద్దకడబూరు, సెప్టెంబర్ 12, ( శ్రీ చక్ర ) : మండల పరిధి లోని మేకడోన గ్రామానికి చెందిన హసీనా(36) అనే మహిళ పురుగుల మందు సేవించి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, బాధితులు,గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని మేకడోన గ్రామానికి చెందిన మధర కాశీం, మెరూన్ బీ కుమారుడు రహంతుల్లాకు ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామానికి చెందిన హసీనాకు దాదాపు 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే కొన్ని సంవత్సరాలు వీరిద్దరి మధ్య సంసారం ప్రశాంతంగా కొనసాగింది. అయితే గత కొద్దీ సంవత్సరాల నుండి కుటుంబ కలహాలని కొందరు గ్రామస్తులు ఆరోపించగా, మరికొందరు గ్రామస్తులు అదనపు కట్నం కొరకు భర్తతోపాటు కుటుంబ సభ్యులు వేధింపులు చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇరువురి కుటుంబ సభ్యుల మధ్య పంచాయతీలు జరగడమే గాక, హసీనాను భర్త రహమతుల్లా అనుమానించేవాడని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో మృతురాలు హసీనా శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పంట పొలానికి ఉపయోగించే పురుగుల మందును సేవించగా, గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ఆమె కోలుకోలేక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు,ఒక కుమారుడు ఉన్నారు. దీంతో హసీనా మృతి చెందడం పట్ల పిల్లల బాగోగులు చూసేది ఎవరని కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.హసీనా మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతురాలి హసీనా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పెద్దకడబూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## విద్యార్థులకు మట్టి నమూనా సేకరణ, పరీక్షలు ప్రాముఖ్యతపై అవగాహన




కోట సెప్టెంబర్ 12 (శ్రీ చక్ర): పీ ఎమ్ ఆర్ కే వీ వై పథకం కింద కోట మండలం ఎమ్ జె పి ఏ పి బి సి డబ్ల్యు రెసిడెన్షియల్ పాఠశాల నందు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ క్రింద 8,9 వ తరగతి,ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ పై అవగాహన శిక్షణ కార్యక్రమం భూసార పరీక్షా కేంద్రము తిరుపతి చెందిన వ్యవసాయ అధికారి శ్రీమతి పరమేశ్వరి గారి చే నిర్వహించడం జరిగినది. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మట్టి నమూనాలు తీసే పద్ధతిని సిద్ధాంతపరంగా వివరించి,ప్రయోగాత్మకంగా పాఠశాల విద్యార్థులకు చూపించడం జరిగింది.ఈ కార్యక్రమము నందు, భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి సుధా, జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి వేణుగోపాల్, పెరియవరం కె.వికె మృత్తికా శాస్త్రవేత్త డాక్టర్ రాజీవన, నెల్లూరు జిల్లా భూ సంరక్షణ సంచాలకులు బిఎస్ చక్రవర్తి , కోట మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ , వ్యవసాయ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి డి.సాయి కుమార్ ,ఏ పి బి సి డబ్ల్యు రెసిడెన్షియల్ పాఠశాల సైన్స్ టీచర్ విజయ్ కుమార్ శాంతి ఏ పి బి సి డబ్ల్యు రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ సరిత రోసాలిన్ పాల్గొని నేల ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి వివరించారు.యూరియా వాడకం గురించి రైతులలో అవగాహన గురించి రైతు సోదరులు యూరియాను ఎక్కువగా వాడడం వలన నేల యొక్క భౌతిక స్వభావము చీడపీడలు ఎక్కువగా ఆశించడం జరుగుతుంది.దీనికి ప్రత్యామ్నాయంగా బయో ఫెర్టిలైజర్స్ నానో యూరియా నానో డీఏపీలను వాడి రైతులు ఖర్చు తగ్గించుకొని నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా మంచి దిగుబడులు సాధించాలని తెలియజేశారు.

## కర్నాటకలో మళ్లీ కులగణన

### సామాజిక అసమానతలు గుర్తించేందుకు సర్వే

### కర్నాటక సిఎం సిద్దరమయ్య స్పష్టీకరణ

బెంగళూరు,సెప్టెంబర్ 12 :రాష్ట్రంలో మళ్లీ కొత్తగా కులగణన చేపట్టనున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. గతంలో ఇచ్చిన నివేదికను అంగీకరించబోమని.. సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 7 మధ్య మళ్లీ కులగణన చేపడతామని వెల్లడించారు. గతంలో చేపట్టిన కులగణన సమాచారం దాదాపు పదేళ్ల కిందటిది గనక ప్రస్తుతం సమాజంలోని వాస్తవాలను తెలుసు కోవడానికి కొత్తగా సర్వే అవసరమని ఆయన అన్నారు. సమాజంలో అనేక కులమతాలతో పాటు- సామాజిక అసమానతలు కూడా ఉన్నాయి. దేశంలోని ప్రజలంతా సమానమేనని.. ప్రజలందరికీ సమాన సామాజిక న్యాయం జరగాలని రాజ్యాంగం చెబుతోంది. దాని ప్రకారమే.. ప్రజల మధ్య అసమాన తలను తొలగించి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు సృష్టించే దిశగా ముందడుగు వేయడానికి మేము నిర్వహించే నూతన సర్వే ఉపయోగపడుతుందని సిద్ధరామయ్య తెలిపారు. 2015లో కర్ణాటక వెనకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే.

# అవినీతి అధికారులపై చర్యలు ఏడాది జీతం తగ్గింపు

కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): కర్నూలు జిల్లాకు చెందిన ఫిర్యాదు దారుడు వి.మురళీధర్ రెడ్డి, ప్రభుత్వ ఉద్యోగులైన అప్పటి కల్లూరు మండల తహశీల్దార్ టి. అంజనాదేవి మరియు కల్లూరు మండలం, లక్ష్మీపురం గ్రామ రెవెన్యూ అధికారి కె.ఎల్.వరప్రసాదరావు ఇరువురు కలిసి దుపాడు గ్రామంలోని సర్వే నెం.15/4లో రూ.4,00,000/-లు లంచం తీసుకొని కొంతమంది లబ్దిదారులకు చట్టవిరుద్ధంగా నకిలీ ఇంటి స్థల పట్టాలను జారీ చేశారని ఆరోపిస్తూ, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సంస్థ నందు ఫిర్యాదు నెం.795/2021/బి1 ద్వారా ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త పి.రజని సదరు ఫిర్యాదు నెం.795/2021/బి1పై విచారణ జరిపి, ఉత్తర్వులు జారీ చేశారు.సంస్థ ఆదేశాలను అనుసరించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భూపరిపాలన ప్రధాన కమిషనర్ మరియు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కర్నూలు జాయింట్ కలెక్టర్ ద్వారా విచారణ నిర్వహించి, సదరు మాజీ తహశీల్దార్ టి.అంజనా దేవి మరియు మాజీ వి.ఆర్.ఓ. కె.ఎల్.వరప్రసాదరావులపై క్రమ శిక్షణా చర్యలు తీసుకొని టి.అంజనా దేవి, మాజీ తహశీల్దార్, కల్లూరు మండలం వారికి ఒక సంవత్సరం పాటు వేతన శ్రేణి తగ్గింపు, (పెన్షన్పై ప్రభావం లేకుండా), మరియు శ్రీ కె.ఎల్.వరప్రసాదరావు, మాజీ గ్రామ రెవెన్యూ అధికారి, కల్లూరు మండలం, లక్ష్మీపురం గ్రామం వారికి రెండు వార్షిక వేతన ఇంక్రిమెంట్లు నిలిపివేశారు.ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణా చర్యల దృష్ట్యా, ఉప లోకాయుక్త ఫిర్యాదు నెం.795/2021/బి1 ను మూసివేయడం జరిగింది. లోకాయుక్త సంస్థ పౌరుల ఫిర్యాదులను పరిష్కరించడంలో మరియు ప్రజాపరిపాలనలో జవాబుదారీతనాన్ని నిర్ధారించడంలో తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని ఈ కేసు ద్వారా ఋజువైంది.

# పర్యావరణ పరిరక్షణతోనే మెరుగైన భవిష్యత్

## ఉల్లిందకొండ జిల్లా పరిషత్ హైస్కూల్ లో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమం





కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): పర్యావరణ పరిరక్షణతోనే మెరుగైన భవిష్యత్ సాకారమౌతుందని కర్నూలు జిల్లా ఉల్లిందకొండ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.లీలావతి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కర్నూలు వారి ఆధ్వర్యంలో పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ అమ్మ పేరిట మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణంతో కూడిన భూమిని అందించటం మనందరి బాధ్యతగా గుర్తించాలని వక్తలు పేర్కొన్నారు. పర్యావరణం - ప్రగతిని సమన్వయం చేసుకుని ముందుకు సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమౌతుందని, ఈ దిశగా విద్యార్థులంతా అమ్మ పేరిట ఒక మొక్క స్ఫూర్తిని వ్యాప్తి చేయటంలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు. దేశంలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంచటంతో పాటు, పర్యావరణ పరిరక్షణ కూడా అత్యంత ఆవశ్యకమన్న గౌరవ ప్రధానమంత్రి మాటలు అక్షర సత్యాలని కార్యక్రమంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కులు నాటడమే కాకుండా, ఆ చాయా చిత్రాన్ని తీసుకుని హ్యాష్ ట్యాగ్ లను వినియోగించి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ - కర్నూలు సిబ్బంది ఫణికుమార్ సహా పాఠశాల ఉపాధ్యాయులు మురళీధర్, జ్యోతి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ -సేవా కేంద్రాలను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి



కర్నూల్ లీగల్, సెప్టెంబర్ 12 (శ్రీ చక్ర ): కర్నూలు నగరంలో కర్నూలు జిల్లా కోర్టు, మున్సిఫ్ కోర్టుల ఆవరణలో కక్షిదారులకు కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఈ -సేవా కేంద్రాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి లీల వెంకట శేషాద్రి, కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు హరినాథ్ చౌదరి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.




# సదాచారులైన సమాజ నిర్మాణం ఎంతో అవసరం

## డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే - ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు





జూపాడుబంగ్లా, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): సదాచారులైన సమాజ నిర్మాణంతో గ్రామంతో పాటు దేశం సర్వాంగీన ఉన్నతిని సాధిస్తుందని, గుడి - బడి ఈలక్ష్య సాధన కోసమే నిరంతరం పనిచేయాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా గోమాతతో ఊరేగింపుగా హరినామ సంకీర్తనలతో ఆలయానికి చేరుకున్నారు. మూడు రోజులపాటు స్థానిక భజన మండలి భజనలు,ఇస్కాన్ ధర్మప్రచారకులుకీర్తిరాజదాస్చేసినధార్మిక ప్రవచనాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి దేవస్థానం ధర్మకర్త పొలిమేర హనుమంతరావు, ధర్మ ప్రచారమండలి సభ్యులు పన్నంగి రామచంద్రుడు, అంబటి శివశంకర రెడ్డి, అర్చకులు మాకం కుమారస్వామి, శివమణి, విశ్వనాథం నారాయణ, కృష్ణయ్య, గానుగ శంకరయ్య, శ్రీ రామేశ్వర రెడ్డి, బాలమ్మ, పార్వతిదేవి, మల్లికాదేవి, రోశమ్మ సుంకులమ్మ, శేషమ్మ, మణి, పద్మావతమ్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వైకాపా నాయకులు నిజాలు తెలుసుకొని మాట్లాడండి,



ఎమ్మిగనూరు, సెప్టెంబర్ ,12( శ్రీ చక్ర):-ఎమ్మిగనూరు ప్రభుత్వం ఆసుపత్రి గురించి మాజీ ఎంపీ, వైసీపీ ఇంచార్జి బుట్టా రేణుక నిజాలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం జనసేన పార్టీ ఇంచార్జి రేఖ గౌడ్, బీజేపీ నాయకులు నరసింహులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఫేక్ ప్రచారాలకు కేరఫ్ వైస్సార్సీపీ అని, కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచికి తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా పని పెట్టుకుందన్నారు. బుట్టా రేణుక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సరిగ్గా లేరని, పరికరాలు సక్రమంగా లేవనడం విడ్డూరంగా ఉందన్నారు. నాబార్డ్ నిధులు కింద టిడిపి హయాంలో 100 పడకల ప్రభుత్వాసుపత్రిని మంజూరు చేశారని, కానీ వైసీపీ ఐదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేకపోయారని సూటిగా ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త ఆసుపత్రిలో పరికరాలు మార్చడానికి సమయం పడుతుందని దాన్ని దృష్టిలో పెట్టుకొని పరికరాలు సక్రమంగా లేవని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి ఇంకా కావాల్సిన సౌకర్యాల గురించి తాను అసెంబ్లీలో చర్చిస్తానని తెలిపారు. గతంలో వైసిపి తప్పిదాల వల్లే పరికరాలు సక్రమంగా లేవని చెప్పారు. క్రిటికల్ కేర్ కొరకు కేంద్రంకు ప్రతిపాదన పంపామని, మనకు నేషనల్ హైవే ఉంటేనే ఈ కేర్ మంజూరు అవుతుందని అందువలన మొదటగా నేషనల్ హైవే పనులు ప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు.ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి డెలివరీలో రాష్ట్రంలోనూ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. మొన్నటి రోజు జుబేదా అనే మహి?ళి5:34 ఖఓ, 9/12/2025ఠ +91 97038 60909: మహిళకు ప్రసవంలో ఐదు కేజీల బాలుడు సజావుగా డెలివరీ చేయడం వైద్యుల మంచి పనితనం అన్నారు. చెప్పిన మాటలు విని వాస్తవాలు తెలుసుకోకుండా బుట్టా రేణుక మాట్లాడుతున్నారన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ 90 శాతం మేరా అమలు చేసిందని విజయోత్సవ సభ దిగ్విజయంగా చేశామన్నారు. మంత్రి నారా లోకేష్ సభకు హాజరు కాకుండా నేపాల్ లో చిక్కుకున్న తెలుగు వాడి కోసం సురక్షితంగా మన ప్రాంతానికి తీసుకురావడానికి చేసిన కృషి ఫలితంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. మాజీ సీఎం జగన్ తమ హయాంలో మెడికల్ కాలేజీలు పూర్తి చేశామని చెప్పడం చూస్తుంటే మన కర్నూలు జిల్లాలోని ఆదోని దగ్గర ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ పూర్తి అయ్యిందా అంటూ సూటిగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వైసిపి అడ్డు తగులుతుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల కన్వీనర్లు, పట్టణ అధ్యక్షులు, పట్టణ కమిటీ సభ్యులు, పార్టీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్యస్పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

## నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్



కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): నగరంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో "ఓపెన్ ఫోరం" కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేందుకు, సమన్వయ లోపం వల్ల జాప్యం జరగకుండా, ప్రజలు తిరగాల్సిన అవసరం లేకుండా తక్షణ సేవలు అందించడానికి ప్రతి శుక్రవారం "ఓపెన్ ఫోరం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.అనంతరం ప్లానింగ్ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్ఆర్యస్ పథకం పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి ప్లానింగ్ కార్యదర్శి తన సచివాలయ పరిధిలో ప్రతిరోజూ పర్యటించి అక్రమ నిర్మాణాలను గుర్తించి, చార్జిషీట్లు దాఖలు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. అనధికారిక లేఅవుట్లను ఎల్ఆర్ యస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించాలని సూచించారు. సి డ డి వేస్ట్ మేనేజ్మెంట్ను సమర్థవంతంగా నిర్వహించి, నిర్మాణదారులకు తగిన అవగాహన కల్పించాలని ఆదేశించారు.అదేవిధంగా ఎల్టిపిలతో కూడా కమిషనర్ చర్చించి, ప్లానింగ్ కార్యదర్శులతో సమన్వయాన్ని బలోపేతం చేయడం, ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించడం పై దృష్టి సారించారు. ఓపెన్ ఫోరం లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిసిపి వెంకట రమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యస్తులను పరామర్శించిన టీడీపీ నేత చాపల నాగేష్



మంత్రాలయం , సెప్టెంబర్ 12,(శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని చెట్నేహాళ్ళి గ్రామానికి చెందిన కురువ నరసింహులు అనారోగ్యంతో బాధపడుతు ఎమ్మిగనూరు ప్రవేయిట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు విషయం తెలుసుకున్న మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ శుక్రవారం హాస్పిటల్ కు వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మరో ఆరు మంది అనారోగ్యంతో బాధపడుతున్న వారిని హాస్పిటల్ వెళ్ళి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి ని డాక్టర్లు ను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేకల మల్లేష్ , పెద్ద లక్ష్మయ్య , డీలర్ గోపాల్ , వెంకటరాముడు , హానుమంతు , నాగరాజు తదితరులు ఉన్నారు.

# ప్రదీప్ రెడ్డి జన్మదిన వేడుకలు



మంత్రాలయం , సెప్టెంబర్ 12, (శ్రీచక్ర) : మండల కేంద్రమైన మంత్రాలయంలో కర్నూలు జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు ముందుగా వైస్సార్సీపీ మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి , సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్యలు రాఘవేంద్ర కూడలిలో కార్యకర్తల మధ్యలో బాణాసంచా కాల్చి అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హోటల్ పరమేష్ , జనార్ధన్ రెడ్డి కురువ మల్లికార్జున,గోరకల్ కృష్ణస్వామి,భాస్కర్ , రొగప్ప , బొజ్జప్ప , కార్యకర్తలు , రాంపురం రెడ్డి సోదరులు అభిమానులు ,తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం -మంత్రాలయం ఏఇ గోవిందు



మంత్రాలయం, సెప్టెంబర్ 12,(శ్రీ చక్ర) : నేడు రెండవ శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని మండలంలోని ప్రజలు సహకరించాలని విద్యుత్ ఏఇ గోవిందు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, 132/32 కేవీ , 33/11కేవీ సబ్-స్టేషన్లు, విద్యుత్ లైన్లు మరియు ట్రాన్స్ఫార్మర్ల నిర్వహణ కార్యకలాపాలు షెడ్యూల్ చేయబడ్డాయి. అందువల్లన మంత్రాలయం మండలం లో మరియు చుట్టుపక్కల గ్రామాలలో ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 01:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మంత్రాలయం విద్యుత్ శాఖ ఏఈ గోవిందు తెలిపారు. కావున మంత్రాలయం, గ్రామీణ ప్రాంతాల వినియోగదారులందరూ సహకరించాలని కోరుతున్నామని, ప్రజలకు అసౌకర్యం కలుగుతున్నందుకు చింతుస్తున్నామన్నారు.

# ఈ యేడాది చివర్లో భారత్కు ట్రంప్

## క్వాడ్ దేశాధినేతల సమావేశాల్లో పాల్గొనే ఛాన్స్



చూపి ట్రంప్ విధించిన భారీ సుంకాలతో భారత్-అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం రెండు దేశాల మధ్య సుంకాల వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటు- చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ఈ ఏడాది చివర్లో భారత్కు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది నవంబర్లో భారత్లో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు ట్రంప్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు- భారత్కు కాబోయే అమెరికా రాయబారి సెర్గీ గోర్ వెల్లడించారు. ఈ సదస్సు కోసం ఆయన ఎదురుచూస్తున్నట్లు- తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి ఇంకా చర్చలు జరుగుతున్నాయని వివరించారు. 2017లో భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు క్వాడ్ కూటమిని ఏర్పాటు- చేశాయి. నాలుగు అగ్రదేశాలతో ఏర్పడిన కూటమి అధినేతలు 2021 సెప్టెంబరు 24న వాషింగ్టన్లో తొలిసారి భేటీ- అయ్యారు. ఇక గతేడాది సదస్సుకు అమెరికా ఆతిథ్యం ఇచ్చింది.

# మల్లన్న సన్నిధిలో అలరించిన గాత్రకచేరి కార్యక్రమం




శ్రీశైలం సెప్టెంబర్ 12 శ్రీశైలం మల్లన్న సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు ధర్మపథంలో భాగంగా (నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా) శుక్రవారం నాడు శ్రీ బులుసు సూర్యనారాయణ మరియు వారి బృందం, హైదరాబాద్ వారిచే గాత్రకచేరి కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ గాత్రకచేరి కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో సిద్ధివినాయకం, శంభోశంకరా, భో... శంభో, నాదతాండవం శంకరం, దేవ దేవం భజే, కాలభైరవాష్టకం, నమోస్తూ వాణి, బ్రహ్మమురారి, నమశ్శివాయ నటేశ్వరాయ తదితర గీతాలను, అష్టకాలను బులుసు సూర్యనారాయణ తదితరులు ఆలాపించనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతి రోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ ధర్మపథం కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## శ్రీశైలంలో పద్మశాలి సత్రం నందు రెండు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు



శ్రీశైలం సెప్టెంబర్ 12 శ్రీశైల పుణ్యక్షేత్రమునకు వచ్చే భక్తుల సౌకర్యార్ధము పద్మశాలి సత్రం, శ్రీశైలం నందు తేది. 11-09-2025 మరియు 12-09-2025 రెండు రోజులు సంస్థ సభ్యులు, వైద్యులు డా? చిలువేరు శ్రీనివాసులు వైద్య శిభిరమును, వారి తల్లిదండ్రులు కీ?శే? చిలువేరు మల్లప్ప,మల్లమ్మ గార్ల జ్ఞాపకార్ధము ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడమైనది. ఈ కార్యక్రమమును సత్రం అధ్యక్షులు శ్రీ కర్నాటి శ్రీధర్ కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీ జేరపు చంద్రశేఖర్ గారు, ప్రధాన కార్యదర్శి శ్రీ రావిరాల చినవీరయ్య గారు,కోశాధికారి శ్రీ ఏలె యాదయ్య ప్రారంభించినారు. గత 16 సంవత్సరములుగా శ్రీశైలం నందు ఈ వైద్య శిభిరమును డా॥ చిలువేరు శ్రీనివాసులు నిర్వహించడం జరుగుతున్నది. ఈ కార్యక్రమములో సత్రం మేనేజర్ శ్రీ ఏల్పుల కృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ జి.గోవిందరాజు, సత్ర సిబ్బంది పి.వి. గిరిధర్, శిరసాల రాఘవేంద్ర, నాగార్జున, మొదలైనవారు పాల్గొన్నారు.సత్రమునకు వచ్చిన యాత్రికులు వైద్య సహాయము పొందినారు. ఇందులో భాగంగా యాత్రికులకు ఉచితంగా మందులు అందజేయడం జరిగింది. రాబోయే రోజులలో ఇంకా ఇటువంటి కార్యక్రమములు నిర్వహించి శ్రీశైలం వచ్చు యాత్రికులకు మెరుగైన సేవలు అందించగలరని యాత్రికులు కోరినారు.

# గొల్లపాలెం–కుయ్యేరు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

## జేపీసీ ఆధ్వర్యంలో ఆందోళన ర్యాలీ





కాజులూరు, సెప్టెంబర్ 12( శ్రీచక్ర)కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం టు కుయ్యేరు రోడ్డు వెంటనే నిర్మాణం చేపట్టాలని కాజులూరు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు . ఈమేరకు శుక్రవారం మండల కేంద్రమైన కాజులూరులో రహదారికి సంబంధించి ఏర్పాటు చేసిన జేఏసీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు రహదారి నిర్మాణపనులు ఆగిపోవడంతో సమావేశమై చర్చించారు.ఈసందర్బంగా పలువురు మాట్లాడుతూ గత పది సంవత్సరం నుండి రోడ్డు పాడైపోయి శిథిలావస్థకు చేరుకున్న రహదారి గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపట్టినా పూర్తి కాలేదని మెయిన్ రోడ్ లో ఉన్న రెండు వంతెనలు పాడైపోయి ఉన్నప్పటికీ వంతెన నిర్మాణాలు చేపట్టకపోవడం వల్ల ఎప్పుడు కూలి పోతాయో అన్న భయాందోళన పరిస్థితి నెలకొందని అన్నారు. అంద్రంగి డ్రైయిన్ కి వేసిన కరకట్టు వల్ల మురుగు వచ్చేటప్పుడు కరకట్టు వరద నీరు దిగలేని కారణంగా పైన పంట పొలాలన్నీ పాడైపోతున్నాయని అన్నారు.అలాగే మండలంలో ఉన్న లింకు రోడ్లు మొత్తం శిథిలావస్థకు చేరి పాడైపోయాయని వెంటనే ఈ నిర్మాణాలు చేపట్టాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. గత జులై 27వ తేదీన ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేసినప్పటికీ మంత్రి సుభాష్ ఆగస్టు 5వ తేదీ నుంచి రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతాయని చెప్పి నేటికీ నెల దాటి కావస్తున్న ఎక్కడ రోడ్డు పనులు మొదలు పెట్టలేదని నాయకులు ఈసందర్భంగా ఆరోపించారు .ఇప్పటివరకు ఎదురుచూసి రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ఈనెల 17వ తేదీన కాజులూరు కృష్ణుడు గుడి వద్ద వంటావార్పు కార్యక్రమంతో పాటు రాస్తా రోకో చేయడం జరుగుతుందని జెఏసి నాయకులు ఈమేరకు గురువారం నిర్ణయించారని పేర్కొన్నారు .ఇప్పటికైనా ఈ ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టాలని కోరారు . అనంతరం జేఏసీ నాయకులు ఆధ్వర్యంలో కాజులూరులో ప్రధాని రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మాధవరపు నానాజీ ,మాజీ జెడ్పిటిసి యాళ్ళ సూర్య ప్రకాష్, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వళ్ళు రాజబాబు, కడలి రాంపండు ,సలాది నానాజీ , దంగేటి అరుణ కుమార్ ,పైడికొండల వీరభద్రరావు, మాజీ ఎంపిటిసి మాత నూకారావు ,యాళ్ళ నరసింహమూర్తి ,షాజహాన్ , తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా... రైతు సేవా కేంద్ర సిబ్బంది ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ





ఆత్మకూరు (శ్రీచక్ర) : ఆత్మకూరు డివిజన్ పరిధి లోని రైతు సేవ కేంద్రాలలో పనిచేస్తున్న వీఏఏ లు, వీహెచ్ఏ లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమమును మండలంలోని ఏంపిడీఓ కార్యాలయం నందు ప్రకృతి వ్యవసాయం పై శిక్షణను ఆత్మకూరు ఏడిఏ హేమలత , వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డిపిఎం అబ్దుల్ సలాం ప్రారంభించారు. ఈ సందర్భంగా సలాం గారు మాట్లాడుతూ డివిజన్ లో ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా చేసుకొని ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. శిక్షణలో పాల్గొన్న గ్రామ స్థాయి వీఏఏ, వీహెచ్ఏలకు ప్రకృతి వ్యవసాయంలో పాటించవలసిన సార్వత్రిక సూత్రాలు, ప్రకృతి వ్యవసాయం లో సంఘాల పాత్ర, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పై సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేసేందుకు గ్రామస్థాయిలో పనిచేసే వీఏఏలు, వీహెచ్ఏలకు ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని తెలియజేశారు. ఏ డి ఏ హేమలత మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితి లో ప్రకృతి వ్యవసాయం అనివార్యం అని ప్రతి రైతు సేవా కేంద్ర సిబ్బంది గ్రామస్థాయి లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తో కలిసి రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి, పాలుపంటల సాగు గురించి వివరించాలని, రైతులను ప్రకృతి వ్యవసాయం లోకి మార్చడానికి ఒక ప్రణాళికతో ముందు వెళ్లాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో అధిక మోతాదులో రసాయన మందులు వాడటం వల్ల నేల స్వభావం మారిపోతుంది అని పంటల దిగుబడి కూడా తగ్గిపోయింది అని, గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అందరం కలిసి పనిచేయాలని, రసాయన మందుల వినియోగం తగ్గించేలా, ప్రకృతి వ్యవసాయాన్ని రైతు పాటించేలా అందరూ కలిసి పనిచేయాలని, ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్దేశించి ఏమైనా సందేహాలు ఉంటే, శిక్షణ కార్యక్రమం లో అడిగి తెల్సుకోవచ్చన్నారు. గ్రామ ఐక్య సంఘాలు, పొదుపు సంఘాలతో కలిసి పనిచేయడం వల్ల ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళవచ్చని అబ్దుల్ సలాం (ఏడిపిఎం) పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంలో పాటించే పద్ధతులు, రైతుల మార్పు గురించి కరీం ఎంఎఫ్ఏ, ఎస్ఆర్పి నరేంద్ర గౌడ్, ఎన్ఎఫ్ఏ నాగరాజు, ఎన్ఎఫ్ఎఫ్ అన్వర్, మాస్టర్ ట్రైనర్ మహబూబ్ భాష, సయ్యద్, రమేష్ నాయక్ లు రైతు సేవా సిబ్బంది కి వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ లోని రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత ను పెంపొందించుకోవాలి



నంబుల పూలికుంట సెప్టెంబర్ 12 ఆర్థిక అక్షరాస్యత ను పెంపొందించుకోవాలని కదిరి సహకార బ్యాంకు మేనేజరు మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల సహకార బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దారని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధి పొందాలంట కు అవకాశం కలగాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష భీమా యేజన మరియు జీవనజ్యోతి భీమా యోజన పథకాల ద్వారా నాలుగు లక్షలు లబ్ధి పొందుటకు చేకూరునానీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీఈఓ బాబా ఫక్రుద్దీన్ ,సుమశ్రీ, శ్రీరాములు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## భారతీయేతర జెండా మోసిన పౌరులు జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

### కోర్టు ముందు తమ తప్పిదం ప్రకటించాలి

### (మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దూసర్లపూడి రమణరాజు)

కాకినాడ సెప్టెంబర్ 12 హిందువులైనా ముస్లిం లైనా క్రైస్తవులైనా మరే మతం వారు అయినా భారతదేశంలో జీవించే ప్రతి భారతీయుడు జాతీయ మువ్వన్నెల జెండా తప్ప ఇతర దేశాల జెండాలు ప్రదర్శించడం సహేతుకం కాదని రాజ్యాంగం ప్రకారం దేశద్రోహ నేరంగా పరిగణించే చట్టాలు అమలులో ఉన్నాయని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దూసర్లపూడి రమణ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల మత పరమైన పండుగ కార్యక్రమంలో పాకిస్తాన్ జెండా చేపట్టి నగర వీధుల్లో తిరిగిన దుస్సంఘటన కాకినాడ జిల్లా కేంద్రంలో జరగడం దురదృష్ట కరంగా సంభవించిందన్నారు. మత పెద్దలు ప్రముఖులు విచారం వ్యక్తం చేయాల్సిన దుస్తితి వచ్చిందన్నారు. ఆకతాయిలు చేసిన ఘటనగా ఇతర దేశాల జెండాలు బహిరంగంగా ప్రదర్శించి ర్యాలీ జరగడం క్షమించరానిదన్నారు. పాక్ జెండా మోసిన వారు ఎవరైనా జాతికి బహిరంగంగా క్షమాపణ చెప్పి న్యాయస్థానం ముందు తమ తప్పిదం ప్రకటించాలని క్షమాపణ కోరాలన్నారు. ఇటువంటి తప్పిదాలు దేశంలో ఎక్కడా జరగకుండా చూడాల్సిన బాధ్యత అన్ని మతాల పెద్దల పైనా ఉందన్నారు. కాకినాడ జిల్లా కేంద్రంలో మత సామరస్యతకు ప్రశాంతతకు పెద్దపేరుగా కాకినాడ ప్రసిద్ధి చెందిందని దేశ సమైక్యతకు అందరూ కలిసి వుండాల్సిన అవసరం బాధ్యత ఉన్నాయన్నారు. జె ఎన్ టి యు వద్ద పిఠాపురం రోడ్ లో దశాబ్దాల కాలంగా కోర్టు కేసులతో ఉన్న ఈద్గా మైదానం ఏర్పాటును కూటమి ప్రభుత్వం పరిష్కరించి ఏర్పాటు చేయించాలన్నారు. మెయిన్ రోడ్ పెద్ద మసీదు వద్ద గత ఏడాది సి ఎం కార్యాలయం నుండి వచ్చిన హామీ ప్రకారం జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయించి మసీదుకు వచ్చే ముస్లిం వృద్ధులు పిల్లల కోసం ట్రాఫిక్ సౌకర్యం కల్పించే పనులు పూర్తి చేయాలని రమణ రాజు కోరారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి




ఒంగోలు,(శ్రీచక్ర) జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పి చైర్పర్సన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ సంబంధిత పనులు ఊపందుకుంటున్నందున రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఆమె అధ్యక్షతన పాత జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ప్రకాశం జిల్లా డీఆర్వో శ్రీ. బి. చిన ఓబులేసు, జడ్పీ సీఈవో చిరంజీవి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ శ్రీ. గంగాధర గౌడ్, దర్శి శాసనసభ్యులు శ్రీ. బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఎర్రగొండపాలెం శాసనసభ్యులు శ్రీ. తాటిపర్తి చంద్రశేఖర్, ఉమ్మడి ప్రకాశం జిల్లా జడ్పీటీసీలు, ఎంపీపీలు, అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వందేమాతరం గీతాలాపనతో ప్రారంభమైన ఈ సమావేశంలో ప్రధానంగా పంచాయతీరాజ్, డి ఆర్ డి ఏ, విద్యుత్, రోడ్లు – భవనాలు, వైద్య, వ్యవసాయ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ప్రధానంగా చర్చించారు.

అర్హులందరికీ పెన్షన్లు : గతంలో పెన్షన్లు పొందిన వారు ప్రస్తుతం పెన్షన్లకు దూరమయ్యారని, అర్హులైన తమకు అన్యాయం జరుగుతోందని వారు ఆందోళన చెందుతున్నారని దర్శి, ఎర్రగొండపాలెం శాసనసభ్యులతో పాటు పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా సందర్భంగా అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై డిఆర్డిఏ పిడి నారాయణ మాట్లాడుతూ అర్హులందరికీ పెన్షన్లు వస్తాయని, మెడికల్ రీ అసెస్మెంట్ జరుగుతోందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దు తన నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారని దర్శి శాసనసభ్యులు చెప్పారు. యూరియా పక్కదారి పట్టకుండా రైతులకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూజిల్లాలోని రైతులకు అవసరమైన పూర్తిస్థాయిలో ఎరువులు, యూరియా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, నిర్దిష్ట ధరలకే వారికి లభించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎరువుల వినియోగంపైనా రైతులకు నిపుణులతో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.

కాలువలపై ప్రత్యేక దృష్టి తన నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహించాయని, ఈ నీరు స్వేచ్ఛగా పారేలా కాలువలను శుభ్రం చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎర్రగొండపాలెం శాసనసభ్యులు అధికారులను కోరారు. దోర్నాలలోని గండి చెరువు నుంచి నీరు లీకు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోర్నాల కమ్యూనిటీ ఆసుపత్రి, ఎర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రులలో అవసరమైన వైద్యులు లేరని, దోర్నాల ఆసుపత్రిలో నీటి సమస్య కూడా నెలకొన్నదని, ఎర్రగొండపాలెం ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని ఇతర మండలాల నుంచి ఎర్రగొండపాలెం కేంద్రానికి అనుసంధానమైన రోడ్లలో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఇతర జడ్పిటిసిలు, ఎంపీపీలు కూడా రోడ్ల విషయంలో స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాగా, స్థానికంగా జరుగుతున్న మరమ్మతు పనుల పురోగతిని, శాఖా పరంగా తీసుకుం టున్న చర్యలను ఆర్ అండ్ బి అధికా రులు వారికి వివరించారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు: తమ ప్రాంతంలో ప్రజలు ఎక్కువగా జ్వరాలతో బాధపడుతున్నారని శాసనసభ్యు లు, పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు చెప్పారు. దీనిపై డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు మాట్లాడు తూ జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో స్వయంగా తాను పర్యటించి పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి అపాయము లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తమ ప్రాంతంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, ట్రాన్స్ఫార్మర్ల కోసం డీ.డీ.లు కట్టిన రైతులు వాటి కోసం ఎదురు చూస్తున్నారని ప్రజా ప్రతినిధులు చెప్పగా, ట్రాన్స్ఫార్మర్లు త్వరగా అందేలా చూస్తామని, విద్యుత్ తీగలను సరి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలలో చేసిన తీర్మానాలను సర్వసభ్య సమావేశం ఈ సందర్భంగా ఆమోదించింది

# తురకపాలెం మరణాలపై కొనసాగుతున్న మిస్టరీ

గుంటూరు, సెప్టెంబర్ 12,గుంటూరు జిల్లా తురకపాలెంలో వరుస మరణాలు సంచలనంగా మారాయి. అధికారులను పరుగులు పెట్టించిన ఘటను అసలు కారణం ఏంటనేది ఇంత వరకు వెలుగులోకి రాలేదు. ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నా ప్రయోజనం లేదు. దీంతో స్థానికంగా ఉన్న ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ వ్యాధి నియంత్రణ బృందం అక్కడ మరికొన్ని పరీక్షలు చేస్తోంది. అసలు విషయం గుర్తించే పనిలో ఉంది. ఓవైపు వైద్య పరీక్షలు కొనసాగిస్తూనే మరోవైపు ఇతర కారణాలపై అధికారులు ఆరా తీశారు. ఈ క్రమంలోనే కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఈ మిస్టరీ మరణాల కేసు మరో మలుపు తిరిగినట్టు కనిపిస్తోంది. ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్య వైద్యం కారణంగానే ఇదంతా జరిగిందనే అనుమానాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన సెలైన్ వాడకం, మితి మీరిన డోస్‌లో మందులు ఇవ్వడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందా అన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.తురకపాలెంలో జ్వరం వచ్చిన తర్వాత చాలా మంది బాధితులు అనుమానిత ఆర్ఎంపీ వద్దే చికిత్స చేయించుకున్నారని తెలుస్తోంది. వారికి చికిత్స చేసే క్రమంలో కాలం చెల్లిన సెలైన్‌తోపాటు, మోతాదుకు మించిన యాంటీబయాటిక్స్ వాడినట్టు అధికారులు గుర్తించారు. ఈ చర్యల వల్ల బాధితులకు జ్వరాలు తగ్గకపోవడంతోపాటు ప్రాణాంతకంగా మారినట్టు భావిస్తున్నారు. పరిస్థితి చేయి దాటిపోయిన తర్వాత వాళ్లంతా వేర్వేరు ఆసుపత్రులను ఆశ్రయించారని తెలుస్తోంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడిన తర్వాత అధికారులు ఆర్ఎంపీ వైద్యంపై క్లారిటీకి వచ్చారు. దీంతో ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌లో జిల్లా వైద్యాధికారులు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో యాంటీబయోటిక్ మందులు గుర్తించారు. అనంతరం క్లినిక్‌ను సీజ్ చేశారు. ప్రస్తుతం అధికారుల అదుపులోనే ఆర్ఎంపీ ఉన్నారు. చేసిన వైద్యంపై ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వైద్యం ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు భయానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిన తురకపాలెంలో గ్రామంలోని ఓ ఆర్ఎంపీ నడుపుతోన్న క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి సీజ్ చేశారు. మృతుల్లో కొందరు ఆర్ఎంపీ వద్దే తొలుత చికిత్స పొందినట్లు గుర్తించారు. అధిక మోతాదులో యాంటీబయాటిక్స్‌ను బాధితులకు ఆర్ఎంపీ ఇచ్చినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అంతేకాదు, ఎక్కువగా సెలైన్ల వాడకం కూడా ఇన్‌ఫెక్షన్‌కు కారణమని భావిస్తున్న అధికారులు.. ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసినట్టు వెల్లడించారు. అయితే, ఈ స్థానికులు మాత్రం ఆ ఆర్ఎంపీ వైద్యంపై విశ్వాసం వ్యక్తం చేయడం గమనార్హం. గత పదేళ్లుగా అతడు తమకు వైద్యం చేస్తున్నాడని, ఎప్పుడూ ఏం కాలేదని చెబుతున్నారు. తమ పిల్లలకు జ్వరం వచ్చినా ఆయన దగ్గరకే వెళ్తామని, చుట్టుపక్కల పది గ్రామాల్లో అతడు వైద్యం చేస్తున్నాడని అంటున్నారు.దాదాపు మూడు వేల జనాభా ఉన్న పల్నాడు జిల్లా తురకపాలెం గ్రామంలో గత ఐదు నెలల్లోనే 28 మంది చనిపోయినట్టు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇటీవల వెల్లడించారు.

జులై, ఆగస్టుల్లోనే 20 మంది వరకు మరణించారు. పలువురు అతి ప్రమాదకరమైన 'మెలియాయిడోసిస్' అనే ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆరుగురిలో ఒకరికి 'మెలియాయిడోసిస్' పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కానీ, బెలిన్ అనే బ్యాక్టీరియా వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుండగా.. గ్రామస్థులకు స్వయంగా ప్రభుత్వమే ఆహారం, తాగునీరు అందజేస్తోంది. అటు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వీధులు, పరిసరాలతో పాటు 68 నీటి ట్యాంకులను శుభ్రపరిచారు.మరోవైపు, తురకపాలెంలో పరిస్థితి అదుపులోకి వచ్చిందని జీజీహెచ్ వైద్యులు తెలిపారు. మెలియాయిడోసిస్ లక్షణాలతో ఆసుపత్రి చేరిన ఇద్దరు కోలుకోవటంతో వారిని డిశ్చార్జ్ చేశామని చెప్పారు. మరికొందరు అనుమానితుల నివేదికలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అటు, ఎన్‌సీడీసీ ఆధ్వర్యంలోని వైద్య నిపుణుల బృందం కూడా గ్రామంలో పర్యటించి, గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసింది.

# అమరావతి ఓఆర్ఆర్ అడుగులు

అమరావతి, సెప్టెంబర్ 12, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.25 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా. 190 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా ఈ రహదారి ఉండనుంది. దీనికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. ఈ ప్రతిపాదనలను కేంద్రానికి పంపగా, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాజధాని అమరావతి ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఓఆర్ఆర్‌కు దాదాపు రూ.25 వేల కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు 190 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా ఉంటుంది. ఓఆర్ఆర్‌కు ఇరువైపులా రెండు వరుసల సర్వీస్ రోడ్లు కూడా ఉంటాయి. మొత్తం పది వరుసల నిర్మాణానికి ఈ అంచనాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలను అధికారులు కేంద్రానికి పంపారు. గతంలో ఈ ప్రాజెక్టుకు 70 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించారు. అప్పుడు దీని నిర్మాణానికి రూ.16,310 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇప్పుడు 140 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించాల్సి ఉంది. ఇప్పుడు ప్రాజెక్టు వ్యయం రూ.25 వేల కోట్లకు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో భూసేకరణ భారం కాకుండా ఉండేందుకు ఆయన కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు.ఈ ప్రతిపాదనలను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ లోని ప్రాజెక్ట్ అప్రైజల్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీకి పంపారు. మోర్త్ ఆమోదం తెలిపితే ఆ ఫైల్(ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య అప్రైజల్ కమిటీ) దగ్గరకు వెళుతుంది. ఆ తర్వాత సెంట్రల్ కేబినెట్ కమిటీ ఆఫ్ ఎకనమిక్ ఎఫైర్స్ ఈ ప్రాజెక్టు బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేస్తే అమరావతి ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. వాస్తవానికి ఓఆర్ఆర్ నిర్మాణానికి మోర్త్ ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ మొదట 70 మీటర్ల వెడల్పుతో అనుమతి ఇచ్చింది. దీనికి సివిల్ పనుల కోసం రూ.12,995 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అలాగే 1,702 హెక్టార్ల భూమిని సేకరించేందుకు రూ.2,665 కోట్లు, 124 హెక్టార్ల అటవీ భూమికి రూ.150 కోట్లు, పర్యావరణ అనుమతులకు రూ.200 కోట్లు, ఇతర ఖర్చుల కోసం రూ.300 కోట్లు కేటాయించారు. మొత్తంగా రూ.16,310 కోట్లకు ఆమోదం తెలిపారు. రింగ్ రోడ్డు లోపలి వైపు మాత్రమే సర్వీస్ రోడ్డు నిర్మించాలని కమిటీ పేర్కొంది.ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి భవిష్యత్తులో ఓఆర్ఆర్‌ను విస్తరించాల్సి వస్తే భూసేకరణ ఖర్చు పెరుగుతుందన్నారు. అందుకే ఇప్పుడే 150 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేయాలని కేంద్రాన్ని కోరారు. రింగ్ రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఉండాలని కేంద్రానికి లేఖ రాశారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు స్వయంగా మాట్లాడారు. సీఎం చంద్రబాబు విజ్ఞప్తికి గడ్కరీ సానుకూలంగా స్పందించారు. 140 మీటర్ల వెడల్పుతో భూసేకరణకు, ఓఆర్ఆర్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఆయన అంగీకరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 140 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతి లభించింది.రాష్ట్ర ప్రభుత్వం కూడా తనవంతుగా సహకారంగా నిర్మాణంలో ఉపయోగించే వస్తువులపై జీఎస్టీ 9 శాతం మినహాయించింది. మట్టి, కంకర, గ్రావెల్ వంటి వాటిపై సీనరేజ్ ఫీజును పూర్తిగా రద్దు చేశారు. ప్రభుత్వం దాదాపు రూ.2 వేల కోట్లు భరించనుంది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.25 వేల కోట్లకు చేరగా.. అందులో భూసేకరణకు రూ.5,600 కోట్లు అవుతుంది.. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు భరిస్తుంది.అమరాతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు భూసేకరణకు సంబంధించి ఏ భూములు కావాలో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లా కలెక్టర్లకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వివరాలు అందజేశారు. ఆ ప్రతిపాదనల్ని పరిశీలించి కలెక్టర్లు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కొన్ని జిల్లాల నుంచి ఇప్పటికే వివరాలు అందజేయగా.. మరికొన్ని జిల్లాలవారు అందజేయాల్సి ఉంది.. మరో రెండు వారాల్లో వివరాలు వస్తాయంటున్నారు.

# కనిగిరికి ట్రైన్...

ఒంగోలు, సెప్టెంబర్ 12, ఏపీలోని ఆ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది.. అక్కడ కొత్త రైల్వే స్టేషన్ సిద్ధమైంది, తొలిసారి రైలు పరుగులు తీసింది. మొదటిసారిగా వచ్చిన రైలుకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు.. మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో రైళ్లు తిరుగతాయనే ఆనందంలో ఉన్నారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో ప్రజలకు నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ రైలు మార్గం ఎన్నో ఏళ్ల కలగా మిగిలింది.. అయితే ఎట్టకేలకు ఆ మార్గంలో పనులు వేగవంతం కావడంతో రైలు కూతలు వినిపిస్తున్నాయి. కనిగిరి వరకు రైలు పట్టాలు, స్టేషన్ల నిర్మాణ పనులు ముగింపు దశకు వచ్చాయి.తాజాగా ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌పూర్ నుంచి ఓ గూడ్స్ రైలు కనిగిరి సమీపంలోని యడవల్లికి చేరుకుంది. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనుల కోసం ఈ రైలు వచ్చింది. దీంతో స్థానిక ప్రజలు ఆనందంలో ఉన్నారు.. ఆ రైలుకు స్వాగతం పలికారు. ఈ రైలు బిలాస్‌పూర్ నుంచి 30 పెట్టెలతో వచ్చింది. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు కావలసిన ట్రాక్‌లు, ఇతర సామాగ్రిని ఈ రైలులో తీసుకొచ్చారు. ఈ రైలు మార్గంలో భూసేకరణ సమస్యలు తీరడం, క్వారీ సమస్య పరిష్కారం కావడంతో రైలు మార్గం త్వరలో అందుబాటులోకి రానుంది. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్‌లో స్థల సేకరణకు సంబంధించిన పరిహారం రూ.7 కోట్లు చెల్లించడంతో సమస్యలు పరిష్కారం అయయ్యాయి. రైల్వే లైన్ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో కనిగిరికి రైళు వస్తాయని తహసీల్దార్ రవిశంకర్ అంటున్నారు. దీంతో కనిగిరి ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది.కనిగిరి దగ్గరలోని శంకవరం దగ్గర ఈ రైలు మార్గంపై క్వారీ నిర్వాహకులు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో వంతెన నిర్మాణం ఆగిపోయింది. దీంతో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి క్వారీల నిర్వాహకులతో చర్చలు జరిపారు, వారితో సమస్యలపై మాట్లాడారు. సమస్యను పరిష్కరించడంతో వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. యడవల్లి, పోలవరం రైలు నిలయాలతో పాటు వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి కనిగిరికి రైళ్లు వస్తాయని రైల్వేశాఖ అధికారులు కూడా చెబుతున్నారు.జిల్లాలోని దర్శి, పొదిలి వరకు రైల్వే మార్గం పనులు దాదాపుగా పూర్తయ్యాయి.. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. మిగిలిన పనుల్ని కూడా ఈ ఒకటి, రెండు నెలల్లో పూర్తి చేస్తామంటున్నారు అధికారులు. కనిగిరి వైపు పనులు జరుగుతున్నాయి.. యడవల్లి రైల్వే స్టేషన్‌కు సంబంధించిన పనులు ముగింపు దశకు వచ్చాయి. ఈ రైలు మార్గంలో నడికుడి నుంచి కనిగిరి వరకు దాదాపు 145 కిలో మీటర్ల మేర రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. యడవల్లి రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్, అధికారుల గెస్ట్ హౌస్‌లు, సిగ్నల్ కార్యాలయం, ప్రయాణికులు కూర్చోడానికి బల్లలు, తాగునీటితో వంటి వసతుల పనులు జరుగుతున్నాయి. అటు పామూరు మండలం రావిగుంటపల్లి వరకు ట్రాక్ సిద్ధమైందని చెబుతున్నారు

# వీడిన శ్రీవారి పింక్ డైమండ్ మిస్టరీ



తిరుమల, సెప్టెంబర్ 12,తిరుమల శ్రీవారి పింక్ డైమండ్ మిస్టరీ వీడింది. అసలు నిజం వెలుగులోకి వచ్చింది. అది అసలు పింక్ డైమండ్ కాదు కెంపు... 1945లో మైసూరు మహారాజు శ్రీవారికి బహూకరించారు1945 జనవరి 9న మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చి, తాను బాల్యంలో ధరించిన హారాన్ని స్వామికి సమర్పించారు. ఈ హారంలో ఉన్నది పింక్ డైమండ్ కాదని, కెంపు (రూబీ) అని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో వెల్లడైంది. మైసూరు ప్యాలెస్ రికార్డుల ప్రకారం, ఈ హారంలో కెంపులు, ఇతర రత్నాలు మాత్రమే ఉన్నాయి, పింక్ డైమండ్ గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ఈ సర్వే వెల్లడించిన విషయాలతో పింక్ డైమండ్ కథ కంచికి చేరినట్టైంది. గతంలో రాజకీయ విమర్శలతో పింక్ డైమండ్ వ్యవహారం భారీగా చర్చకు తావిచ్చింది. ప్రభుత్వాన్ని, తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేసేలా అప్పట్లో వైసీపీ చేసిన ప్రచారం అసత్యం అని తేల్చి చెప్పేలా కొన్ని ఆధారాలను బయపెట్టారు ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నం. తిరుమల శ్రీవారికి విలువైన ఆభరణాలు సమర్పించిన రాజుల్లో మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ కూడా ఉన్నారు1945 జనవరి 9న తిరుమల శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. ఈ పర్యటనకు సంబంధించి మైసూర్ ప్యాలెస్ నుంచి 1944 డిసెంబరు 29న రామయ్య అనే ప్యాలెస్ అధికారి ఋఆ కమిషనర్‌కు లేఖ రాసినట్టు ఆధారాలున్నాయి. రైలు ద్వారా 1945 జనవరి 9న ఉదయం 8 గంటలకు రేణిగుంటకు చేరుకున్న రాజావారు తిరుపతి, శ్రీకాళహస్తి రాకపోకలకు 2 కార్లు ఏర్పాటు చేసేందుకు సహకరించాలంటూ ఆ లేఖలో ఉంది. టూర్ షెడ్యూల్ కాపీని కూడా పంపించారు. ఈ పర్యటనకు వచ్చినప్పుడే మహారాజు శ్రీవారికి హారాన్ని సమర్పించారు. అప్పటి నుంచి ఆ హారాన్ని విశేష ఉత్సవాల సమయంలో ఉత్సవమూర్తులకు అలంకరిస్తోంది టీటీడీ. ఇందులో భాగంగా 2001 అక్టోబరు 21న జరిగిన గరుడ సేవలో మలయప్పస్వామికి అలంకరించిన ఆహారం..కెంపు విరిగిపోయింది. భక్తులు విసిరిన నాణేలు తగిలి ఇలా జరిగిందని ఆ విషయాన్ని తిరువాభరణం రిజిస్టర్ లో నమోదు చేశారు. అయితే మైసూర్ మహారాజు సమర్పించిన హారంలో ఉన్నది కెంపు కాదు పింక్ డైమండ్ అని.. దాన్ని అపహరించి జెనీవాలో జరిగిన వేలంలో విక్రయించారని 2018లో తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు రమణదీక్షితుల వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయ్. ఆ ఆరోపణల్లో వాస్తవం లేదంటూ జగన్నాథరావు కమిటీ ఇచ్చిన నివేదికలో పగిలిన కెంపు ముక్కలు పేష్కార్ ఆధీనంలో ఉన్నాయని స్పష్టంగా వివరణ ఇచ్చారు. అయినప్పటికీ స్వామికి కొన్నేళ్లుగా కైంకర్యాలు నిర్వహిస్తున్న రమణ దీక్షితులు ఈ మాట చెప్పడంతో భక్తులు సందేహంలో పడ్డారు. శ్రీకృష్ణ దేవరాయలు ఇచ్చిన ఆభరణాల్లో కొన్ని మాయమయ్యాయనే ఆరోపణలు రావడంతో 2009 సెప్టెంబరులో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జగన్నాథరావు నేతృత్వంలో ఓ కమిటీ, 2010లో జస్టిస్ వాద్వా నేతృత్యంలో మరో కమిటీ వేశారు. ఆభరణాలన్నీ సక్రమంగానే ఉన్నాయని తేలింది. జగన్నాథరావు కమిటీ కూడా 1952 నుంచి ఉన్న రికార్డుల ప్రకారం ఆభరణాలన్నీ పదిలంగా ఉన్నాయని నివేదికలో పేర్కొంది. 2001బ్రహోత్సవాల సమయంలో పగిలిన కెంపు స్థానంలో వెంటనే ఓ పగడం తిరిగి అమర్చినట్టు కమిటీ వివరించింది. మైసూరు మహారాజు సమర్పించిన హారంలో పింక్ డైమండ్ లేదనే విషయాన్ని తేల్చి చెప్పారు మైసూరులోని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నం రెడ్డి. మైసూరు మహారాణి ప్రమోద దేవిని కలవడంతో పాటూ ప్యాలెస్ లో రికార్డులు పరిశీలించగా ఈ విషయాలు వెలుగుచూశాయ్. దీంతో గతంలో చేసిన విమర్శలు అవాస్తవాలే అని తేలింది.

# లిక్కర్ కేసులో కొత్త మలుపులు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 12, ఏపీలో మద్యం కుంభకోణం కేసు మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో ఒకవైపు విచారణ.. ప్రత్యేక దర్యాప్తు బృందం తనిఖీలు.. మరోవైపు నిందితుల అరెస్టు.. కోర్టు బెయిళ్లు కొనసాగుతున్నాయి. తాజాగా జగన్మోహన్ రెడ్డి సన్నిహితుడు నర్రెడ్డి సునీల్ రెడ్డికి సంబంధించిన కార్యాలయాల్లో ఏకకాలంలో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. హైదరాబాద్ తో పాటు విశాఖలోని 11 కార్యాలయాల్లో సోదాలు జరుపుతున్నారు. మద్యం కుంభకోణం కేసులో సునీల్ రెడ్డి సైతం ఉన్నారు. హైదరాబాద్లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3 స్నేహ హౌస్ లో, సాగర్ సొసైటీలో, ఖైరతాబాద్ కమలాపురి కాలనీలో, విశాఖలోని వాల్తేరు రోడ్డులో ఉన్న కార్యాలయాల్లో సిట్ అధికారుల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడ ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులకు కొన్ని ఆధారాలు పట్టుబడినట్లు సమాచారం.మద్యం కుంభకోణం కేసులో పట్టు బిగిస్తోంది ప్రత్యేక దర్యాప్తు బృందం. కానీ ఈ కేసులో అరెస్ట్ అయిన మాజీ ఐఏఎస్ అధికారి ధనంజయ రెడ్డి, అప్పటి జగన్ ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప బాలాజీలు బెయిల్ పై విడుదలయ్యారు. వారిపై ఆధారాలకు సంబంధించి చార్ట్ సీట్లో సరైనవి చూపించలేదు. దీంతో కోర్టు వారికి బెయిల్ ఇచ్చింది. అయితే మిగతా నిందితులకు సంబంధించి బెయిల్ వస్తుందని అంతా భావిస్తున్నారు. అయితే ఆ ముగ్గురు బెయిల్ విషయంలో సిట్ వ్యూహాత్మకంగా వ్యవహరించిందని తెలుస్తోంది. అదే సమయంలో ఐదు రోజుల కిందట మధ్యంతర బెయిల్ పై విడుదలయ్యారు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి సమన్వయం చేసుకునేందుకుగాను ఆయన వేసిన పిటిషన్ మేరకు ఏసిబి కోర్టు బెయిల్ ఇచ్చింది. ఐదు రోజుల అనంతరం కోర్టు ఆదేశాల మేరకు రాజమండ్రి సెంట్రల్ జైల్లో సరెండర్ అయ్యారు మిథున్ రెడ్డి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్యం కుంభకోణం కేసును చాలా తేలిగ్గా తీసుకుంది. అసలు ఇందులో ఆధారాలు లేవని చెప్పుకొచ్చింది. కానీ సిట్ దర్యాప్తు చూస్తుంటే లోతైన విచారణలా కనిపిస్తోంది. మరోవైపు నిందితులకు బెయిల్ వస్తోంది. ఇటువంటి కన్ఫ్యూజన్ వాతావరణంలో జగన్మోహన్ రెడ్డికి సన్నిహితుడిగా భావిస్తున్న సునీల్ రెడ్డి కంపెనీల్లో ఏకకాలంలో సోదాలు జరుగుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది.ఏక కాలంలో 10 కంపెనీల్లో తనిఖీలు చేస్తుండడం సంచలనంగా మారింది. అక్కడ కీలక ఆధారాలు లభ్యమైనట్లు ప్రచారం నడుస్తోంది.



# ఏంటీ విచిత్ర వాతావరణం

కాకినాడ, సెప్టెంబర్ 12,ఏపీలోవిచిత్ర వాతావరణం కొనసాగుతోంది. ఒకవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. అదే స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. ఉక్కపోత, వేడి తీవ్రత కొనసాగుతోంది. సరిగ్గా ఇదే సమయంలో బంగాళాఖాతం నుంచి ఒక హెచ్చరిక వచ్చింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఏపీవ్యాప్తంగా వర్షాలు పడే సూచన కనిపిస్తోంది. కొన్ని జిల్లాలకు అయితే భారీ వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. ప్రధానంగా ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు పడతాయని చెబుతోంది. విశాఖ, అల్లూరి, సీతారామరాజు, అనకాపల్లి,కాకినాడలో తీవ్రత అధికంగా ఉండనుంది. ఈనెల 14 వరకు వర్షాలు ఉండబోతున్నాయని చెబుతోంది. చాలా జిల్లాలకు వర్ష సూచన ఉంది. ప్రధానంగా అల్లూరి,ఏలూరు, ఎన్టీఆర్,గుంటూరు, బాపట్ల,పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. విజయనగరం, విశాఖ, అనకాపల్లి,కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది.ఇంకోవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. పరిస్థితి చూస్తుంటే వేసవి( మాదిరిగానే ఉంది. ఉదయం 8 గంటలనుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండలు కాస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు దాటుతున్నాయి.

# స్వస్థలాకు సేఫ్ గా ఆంధ్రులు..

ఖాట్మాండు, విజయవాడ, సెప్టెంబర్ 12, ఏపీ మంత్రి నారా లోకేష్ కృషి ఫలించింది. ఆయన చొరవతో నేపాల్ నుంచి ఏపీ వాసులు క్షేమంగా చేరుకున్నారు. నేపాల్ లో ఆందోళనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. హింసతో నేపాల్ అట్టుడుకి పోతోంది. ఈ నేపథ్యంలో నేపాల్ వెళ్లిన తెలుగు ప్రజల భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అయ్యింది. నేపాల్ వెళ్లిన బాధిత కుటుంబాలు ఆందోళనతో ఉన్నాయి. ఈ తరుణంలో నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించేందుకు మంత్రి నారా లోకేష్ రంగంలోకి దిగారు. ఢిల్లీలో ఏపీ భవన్ తో పాటు నేపాల్ లో ఉన్న భారత రాయబార కార్యాలయంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకున్నారు. నేరుగా బాధితులతో వీడియో కాల్ లో మాట్లాడుతూ తగు జాగ్రత్తలు సూచించారు. అక్కడ నుంచి స్వస్థలాలకు క్షేమంగా బయలుదేరేలా ఏర్పాట్లు చేయడంలో నరాల్లోకే సక్సెస్ అయ్యారు.కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న క్రమంలో 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' పేరుతో అనంతపురంలో కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభ నిర్వహించింది. అయితే ఆ సభకు మంత్రి నారా లోకేష్ వెళ్లలేదు. సచివాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్ నుంచి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ చర్యలు ఫలించి నేపాల్ లో చిక్కుకున్న తెలుగు ప్రజలు స్వదేశానికి పయనం అవుతున్నారు. నేపాల్ లో 12 ప్రాంతాల్లో 217 మంది ఏపీ వాసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిని ఏపీకి రప్పించేందుకు చర్యలు ప్రారంభించారు. తొలివిడతగా నేపాల్ లోని హెటౌడా నుంచి 22 మంది ఏపీ వాసులను సురక్షితంగా బీహార్ సరిహద్దు ప్రాంతాలకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఏపీకి రప్పించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తమను క్షేమంగా తీసుకురావడంపై ఏపీ ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.మరోవైపు ఖాట్మండు పరిసరాల్లో ఉన్న 173 మందిని తరలించేందుకు గురువారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక విమానం ఢిల్లీ నుంచి నేపాల్ వెళ్లింది. అక్కడ కర్ఫ్యూ సడలించిన వెంటనే ఏపీకి బయలుదేరనుంది. మిగతా 173 మందిని విశాఖ, విజయవాడ తరలించేలా ఏర్పాటు చేశారు. నేపాల్ లో చిక్కుకున్న వారితో మంత్రి నారా లోకేష్ వీడియో కాల్ లో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు.

# స్పోర్ట్స్ న్యూస్

## ఆసియా కప్ మధ్యలో జట్టును వీడిన స్టార్ క్రికెటర్!

ప్రస్తుతం జరుగుతున్న ఆసియా కప్ 2025లో టీమిండియా తమ తొలి మ్యాచ్‌లోనే యూఏఈపై 9 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని సాధించి టోర్నమెంట్‌లో అడుగుపెట్టింది. రాబోయే రోజుల్లో పాకిస్థాన్‌తో జరగబోయే కీలక మ్యాచ్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో భారత ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తీసుకున్న ఓ నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. జట్టులో రిజర్వ్ ఆటగాడిగా ఉన్న ఆయన.. టోర్నమెంట్ మధ్యలోనే టీమిండియాను వీడి ఇంగ్లాండ్‌కు బయలుదేరారు.వాషింగ్టన్ సుందర్‌ను ఆసియా కప్ 2025 కోసం ప్రధాన జట్టులో కాకుండా రిజర్వ్ స్క్వాడ్‌లో చేర్చారు. దీంతో వాషింగ్టన్ సుందర్ కు ఈ టోర్నమెంట్లో ఆడే అవకాశం దాదాపు లేదనే చెప్పాలి. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు హ్యాంప్‌షైర్ క్రికెట్ క్లబ్ నుంచి ఆయనకు ఓ కీలక ఆఫర్ వచ్చింది. తన ఆటను కొనసాగించాలనే ఉద్దేశంతో వాషింగ్టన్ సుందర్ ఈ ఆఫర్‌ను అంగీకరించారు. ఇప్పుడు వాషింగ్టన్ సుందర్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో హ్యాంప్‌షైర్ తరఫున మిగిలిన రెండు మ్యాచ్‌లలో బరిలోకి దిగనున్నారు.వాషింగ్టన్ సుందర్‌ను తమ జట్టులోకి స్వాగతిస్తూ హ్యాంప్‌షైర్ క్రికెట్ క్లబ్ తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేసింది.



“సుందర్‌ను మా జట్టులోకి చేర్చుకోవడం మాకు చాలా సంతోషంగా ఉంది. స్వాగతం వాషి! భారత ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్, రోజ్ అండ్ క్రౌన్‌పై మా చివరి రెండు మ్యాచ్‌లకు హ్యాంప్‌షైర్ తరఫున ఆడతారు” అని పేర్కొంది.క్లబ్ క్రికెట్ డైరెక్టర్ గైల్స్ వైట్ కూడా సుందర్ రాకపై తన ఆనందాన్ని పంచుకున్నారు. “వాషింగ్టన్‌ను మా జట్టులోకి చేర్చుకోవడం మాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇంగ్లాండ్‌పై అతని గత సిరీస్ అద్భుతంగా ఉంది. సోమర్‌సెట్, సర్రే జట్లపై రాబోయే రెండు కీలక మ్యాచ్‌లలో అతను ప్రధాన పాత్ర పోషిస్తాడని మేము నమ్ముతున్నాం” అని ఆయన అన్నారు.వాషింగ్టన్ సుందర్ ఇటీవలి ఇంగ్లాండ్ పర్యటనలో బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ తన సత్తా చాటారు. 5 టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో బ్యాటింగ్‌లో 47 సగటుతో 284 పరుగులు చేశారు. ఇందులో ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో సాధించిన అద్భుతమైన సెంచరీ కూడా ఉంది. సుందర్ తన బౌలింగ్‌లో 38.57 సగటుతో 7 వికెట్లు పడగొట్టారు. వాషింగ్టన్ సుందర్ చూపించిన ఈ అద్భుతమైన ఫామ్‌ను చూసే హ్యాంప్‌షైర్ క్లబ్ కౌంటీ సీజన్ చివరి భాగం కోసం అతన్ని ఎంచుకుంది.వాషింగ్టన్ సుందర్ రిజర్వ్ స్క్వాడ్‌లో ఉండటం వల్ల ఆయన నిష్క్రమణ భారత జట్టు ఆసియా కప్ ప్రదర్శనపై ఎటువంటి ప్రభావం చూపదు. ప్రధాన జట్టులో సుందర్‌కు ఆడే అవకాశం లభించదు కాబట్టి, ఈ నిర్ణయం భారత జట్టుకు పెద్ద సమస్యగా మారదు. ఈ కౌంటీ మ్యాచ్‌ల ద్వారా సుందర్ తన ఫామ్‌ను కొనసాగించే అవకాశం లభిస్తుంది.

## తిలక్ వర్మ ఏ హీరో ఫ్యాన్ తెలుసా..ఆ ఫ్యాన్ బేస్ వర్మకు కలిసొచ్చిందిగా..!!

భారత యువ క్రికెటర్, హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ ప్రస్తుతం టీమిండియాలో అద్భుతమైన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ముఖ్యంగా ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతూ, ఆ తర్వాత టీ20, వన్డే ఫార్మాట్లలో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించి తనదైన ముద్ర వేశాడు. ఈ యువ సంచలనం కేవలం క్రికెట్‌లోనే కాదు, సినిమా రంగంలోనూ ఒక పాన్ ఇండియా స్టార్‌కు వీరాభిమాని అని తాజాగా వెల్లడించారు.ఓ ఇంటర్వ్యూలో తిలక్ వర్మకు ఇష్టమైన హీరో ఎవరు అని అడగగా,ఏమాత్రం ఆలోచించకుండా ‘పాన్ ఇండియా స్టార్ ప్రభాస్’ అని చెప్పారు. తనకు ప్రభాస్ అంటే చాలా అభిమానమని, ఆయన సినిమాలంటే చాలా ఇష్టమని తిలక్ వర్మ తెలిపారు.క్రికెట్‌లో దూసుకుపోతున్న ఈ యువ క్రికెటర్ నుంచి ప్రభాస్ పేరు వినడం అభిమానులకు ఆశ్చర్యం కలిగించింది.ఐపీఎల్: 2022లో ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చిన తిలక్ వర్మ, తన అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. డెబ్యూ సీజన్‌లోనే 397 పరుగులు చేసి అందరినీ ఆకట్టుకున్నాడు.అంతర్జాతీయ అరంగేట్రం: ఐపీఎల్‌లో మంచి ప్రదర్శన కారణంగా 2023లో వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో భారత జట్టులోకి ఎంపికయ్యాడు. టీ20లలో అరంగేట్రం చేసిన మొదటి మ్యాచ్‌లోనే 39 పరుగులు చేసి తన సత్తా చాటాడు. ఆ తర్వాత ఆసియా కప్, వన్డే వరల్డ్ కప్ జట్టులో కూడా చోటు సంపాదించాడు.ఆట శైలి: ఆత్మవిశ్వాసంతో కూడిన బ్యాటింగ్, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం తిలక్ వర్మ బలం. భవిష్యత్తులో భారత క్రికెట్‌కు ఒక పెద్ద అసెట్‌గా మారే అవకాశాలున్నాయని క్రీడా పండితులు అంచనా వేస్తున్నారు.క్రికెట్ స్టార్‌గా ఎదుగుతున్న ఈ యంగ్ టాలెంట్ ప్రభాస్ అభిమాని కావడం సినీ, క్రీడా రంగాల అభిమానులను ఆకట్టుకుంది.అంతేకాదు ఎప్పుడైతే తిలక్ వర్మ తాను ప్రభాస్ ఫ్యాన్ అని చెప్పాడో అప్పుడే సగం ప్రభాస్ ఫ్యాన్ బేస్ తిలక్ వర్మకు ఒకరకంగా ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసింది.




## బంగ్లాదేశ్ ఘన విజయం.. హాంగ్ కాంగ్ ఔట్!

ఆసియా కప్ 2025 టోర్నీలో బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. హాంగ్ కాంగ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన బంగ్లాదేశ్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. కెప్టెన్ లిటన్ దాస్(39 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 59) హాఫ్ సెంచరీతో బంగ్లాదేశ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన హాంగ్ కాంగ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 143 పరుగులు చేసింది. కెప్టెన్ యసిమ్ ముర్తాజా(19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 28) మెరుగైన ప్రదర్శన చేశాడు. ఓపెనర్ జీషన్ అలీ(34 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 30), నిజకత్ ఖాన్(40 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 42) రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో టస్కిన్ అహ్మద్, తంజీమ్ హసన్ షకీబ్, రిషద్ హొస్సేన్ రెండేసి వికెట్లు తీసారు.అనంతరం బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 3 వికెట్లకు 144 పరుగులు చేసి గెలుపొందింది. లిటన్‌దాస్‌కు తోడుగా టౌహిడ్ హృదయ్(36 బంతుల్లో ఫోర్‌తో 35 నాటౌట్) రాణించాడు. హాంగ్ కాంగ్ బౌలర్లలో అయుష్ శుక్లా, అతీక్ ఇక్బాల్ చెరో వికెట్ తీసారు. లక్ష్యచేధనలో బంగ్లాదేశ్ ఓపెనర్లు పర్వేజ్ హోస్సేన్(19), తంజిద్ హసన్(14) త్వరగానే ఔటైనా.. కెప్టెన్ లిటన్ దాస్, టౌహిడ్ హృదయ్ ఆచితూచి ఆడారు. 44 బంతుల్లో లిటన్ దాస్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.విజయం ముంగిట లిటన్ దాస్ క్లీన్ బౌల్డ్ కావడంతో మూడో వికెట్‌కు నమోదైన 95 పరుగుల భాగస్వామ్యానిక తెరపడింది. జాకెర్ అలీ(0 నాటౌట్)తో కలిసి టౌహిడ్ హృదయ్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన హాంగ్ కాంగ్.. సూపర్-4 రేసు నుంచి తప్పుకుంది. ఆ జట్టు శ్రీలంకతో ఆఖరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. అద్భుతం జరిగితే తప్పా హాంగ్ కాంగ్ ముందడుగు వేసే అవకాశం లేదు.




## ప్రాక్టీస్ చేస్తున్న రోహిత్ శర్మ.. గూజ్‌బంప్స్ రియాక్షన్ ఇచ్చిన రితిక



ముంబై: వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ కొంత బ్రేక్ తర్వాత మళ్లీ బ్యాట్ పట్టాడు. నెట్స్‌లో అతను ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. ప్రాక్టీస్ సెషన్‌కు చెందిన ఓ వీడియోను తన ఇన్‌స్టా అకౌంట్‌లో పోస్టు చేశాడు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత రోహిత్ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడలేదు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున అతను ఈ ఏడాది చివరగా క్రికెట్ ఆడాడు. అయితే ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే సిరీస్‌లో మళ్లీ మైదానంలోకి దిగే ఆలోచనలో రోహిత్ శర్మ ఉన్నాడు. ఆ ఉద్దేశంతోనే అతను మళ్లీ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.ప్రాక్టీస్ సమయంలో అభిషేక్ నాయర్ అతనికి సహకరించాడు. ఇన్‌స్టాలో రోహిత్ పోస్టు చేసిన వీడియోకు చాలా కామెంట్స్ వచ్చాయి. కానీ అతని భార్య రితిక సాజ్దే భావోగ్వేగభరిత కామెంట్ చేశారు. గూజ్‌బంప్స్ వస్తున్నట్లు ఆమె రోహిత్ పోస్టుకు రియాక్ట్ అయ్యారు. దీంతో పాటు కన్నీళ్లతో నిండిన మూడు కంటి ఎమోజీలను కూడా ఆ పోస్టుకు ఆమె యాడ్ చేసింది.అయితే రోహిత్ మాత్రం తన ప్రాక్టీస్ సమయంలో చాలా ఫిట్‌గా ఉన్నట్లు కనిపించాడు. ఛాలెంజింగ్‌గా మారనున్న ఆ వన్డే టూరుకు సిద్ధంగా ఉన్నట్లు రోహిత్ తన ప్రాక్టీస్‌తో చెప్పేశాడు. ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ 2025-27 సిరీస్ ప్రారంభానికి ముందే టెస్టు క్రికెట్ నుంచి రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. 2013 నుంచి 2025 వరకు రోహిత్ 67 టెస్టులు ఆడాడు. దాంట్లో అతను 40.17 సగటుతో 4301 రన్స్ స్కోర్ చేశాడు. 12 సెంచరీలు, 18 ఫిఫ్టీలు ఉన్నాయి.

## టాలెంట్ ఉంటే సరిపోదు.. అవి ఉంటేనే సక్సెస్..: గిల్




అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కొన్నాళ్ల లోనే చాలా ఎత్తుకు ఎదిగిపోయాడు.. యువ క్రికెటర్ శుభ్‌మాన్ గిల్ 2019లో వన్డే జట్టులో, 2020లో టెస్టుల్లో అడుగు పెట్టిన గిల్.. తాజాగా భారత టెస్ట్ జట్టుకు కెప్టెన్ అయిపోయాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్‌సిరీస్‌లో కెప్టెన్‌గా జట్టును అద్భుతంగా ముందుకు నడిపించి.. సిరీస్‌ని 2-2గా సమం చేశాడు. అంతేకాక.. తాజాగా ఆసియాకప్ కో?సం ప్రకటించిన జట్టులో వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అయితే తనకు ప్రపంచ క్రికెట్‌లో ఇద్దరు మార్గదర్శకులని గిల్ వెల్లడించాడు. తాను క్రికెటర్‌గా మారేందుకు కారణమైన దిగ్గజాల గురించి చెప్పాడు. తన తండ్రికి సచిన్ అంటే ఎంతో ఇష్టమని.. అందుకే తనని కూడా క్రికెటర్ చేశారని అన్నాడు. ఇక కోహ్లీ నిబద్ధత తనకు స్ఫూరి అని పేర్కొన్నాడు.“టాలెంట్, నైపుణం ఉంటే సరిపోదు.. ఆడాలనే తపన, అభిరుచి లేకపోతే.. సక్సెస్ కాలేవు. ఈ విషయంలో విరాట్ కోహ్లీ నా స్ఫూర్తి. ప్రశంసల గురించి పట్టించుకోను. నా బాధ్యతలు ఎలా నెరవేర్చాలో అని ఆలోచిస్తా. సచిన్ అంటే మా నాన్నకు చాలా ఇష్టం. నేను క్రికెటలో రావాడానికి కారణం అదే. సచిన్ 2013లో రిటైర్ అయితే.. నేను 2011-13 మధ్య క్రికెట్ ఆడటం ఎలాగో అర్థం చేసుకున్నా. కేవలం నైపుణ్యమే కాకుండా.. మానసికంగా, వ్యూహాత్మకంగా గేమ్ గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. విరాట్‌తో కలిసి ఆడే అవకాశం రావడంతో అతన్ని దగ్గర నుంచి గమనించే అవకాశం కూడా వచ్చింది. నిజంగా అతడి నిబద్ధత చాలా గ్రేట్” అని గిల్ వివరించాడు.

## ఏడు నెలలు క్రికెట్‌కి దూరం.. తొలి మ్యాచ్‌లో రెచ్చిపోయిన అర్జున్..

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ క్రికెట్‌లో అంతగా పేరు సంపాదించలేకపోయాడు. ఇప్పటికీ సచిన్ కుమారుడిగానే అతన్ని చూస్తున్నారు. కానీ, తనకంటే సొంత గుర్తింపు తెచ్చుకోలేకపోయాడు. అయితే తనకు దొరికి అవకాశాలను మాత్రం సద్వినియోగం చేసుకుంటున్నాడు అర్జున్. మరోవైపు ఇటీవల అర్జున్ ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలినే అతడు వివాహం చేసుకోనున్నాడు. అయితే ఏడు నెలల విరామం తర్వాత తిరిగి మైదానంలోకి అడుగుపెట్టిన అతడు.. తొలి మ్యాచ్‌లోనే చెలరేగిపోయాడు. ఐదు వికెట్ల ప్రదర్శనతో ప్రత్యర్థులకు చుక్కలు చూపించాడు.కర్ణాటక క్రికెట్ సంఘం ఆధ్వర్యం డాక్టర్ కె.తిమ్మప్పయ్య మెమోరియల్ టోర్నమెంట్ జరుగుతోంది. ఈ టోర్నీలో అర్జున్ గోవా తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇందులో భాగంగా మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో అతడు చెలరేగిపోయాడు. తొలి బంతికే వికెట్ తీసిన అర్జున్.. మొత్తం ఐదు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. ఫలితంగా మహారాష్ట్ర జట్టు 136 పరుగులకే ఆలౌట్ అయింది. బౌలింగ్‌తో పాటు అర్జున్ బ్యాటింగ్‌లోనూ మంచి ప్రదర్శన చేశాడు. గోవా ఇన్నింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కి వచ్చిన అర్జున్ 44 బంతుల్లో 36 పరుగులు చేశాడు. దీంతో గోవా తొలి ఇన్నింగ్స్‌లో 333 పరుగులు చేసింది. ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లో మహారాష్ట్ర 127/2 స్కోర్‌తో ఆడుతోంది.



# ఈ ఒక్కటి ప్రతిరోజూ తీసుకోండి.. మీ డయాబెటిస్ కంట్రోల్ లో ఉంచుకోండి!



బార్లీ... ధాన్యాలలో ఇది ఒకటి. బార్లీలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది . దీనిని ఆహారంగా మాత్రమే కాదు బీర్ల తయారీలోనూ, పశుగ్రాసంగాను ఉపయోగిస్తారు. బార్లీ మానవ శరీరానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా సమశీతోష్ణ వాతావరణంలో పండించే ఒక ప్రధాన ధాన్యపురకం బార్లీ . దీనికి చాలా పెద్ద చరిత్ర ఉంది. యురేషియాలో పదివేల సంవత్సరాల క్రితమే దీన్ని పండించారు. మానవుడు తొలినాళ్ళల్లో సాగుచేసిన ధాన్యాలలో బార్లీ ఒకటి. బార్లీతో ఈ అనారోగ్య సమస్యలకు చెక్ బార్లీని వివిధ రకాల వంటకాలలో, ముఖ్యంగా బార్లీ నీళ్లతో గంజి, అన్నం వంటివి తయారు చేయడానికి ఉపయోగిస్తారు. బీర్, బార్లీ కాఫీ వంటివి తయారు చేయడానికి కూడా ఉపయోగిస్తారు. బార్లీలో ఎక్కువగా ఫైబర్ ఉండటం వల్ల ఇది రక్తంలో అధికంగా ఉన్న కొలెస్ట్రాల్ ను, చక్కెర స్థాయిలను తగ్గించి జీవక్రియను మెరుగుపరుస్తుంది. డయాబెటిస్ నిర్వహణలో బార్లీ చాలా ప్రముఖ స్థానం పోషిస్తుంది. బార్లీతో ఇన్సులిన్ సున్నితత్వం మెరుగు బార్లీలో బీటా-గ్లూకాన్ సమృద్ధిగా ఉంటుంది, ఇది గ్లూకోజ్ శోషణను నెమ్మదిగా చేసే ఒక రకమైన ద్రావణీయ ఫైబర్. ఇది స్థిరమైన రక్త చక్కెర స్థాయిలను నిర్వహించడంలో సహాయపడుతుంది. మన శరీరంలో బ్లడ్ షుగర్ ను గణనీయంగా నియంత్రిస్తుంది. క్రమం తప్పకుండా బార్లీ ని ఉపయోగించడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచవచ్చుబార్లీ డయాబెటిస్ నిర్వహణపై అధ్యయనం ఇది డయాబెటిస్ నిర్వహణకు చాలా కీలకంగా ఉంటుందని భావిస్తున్న క్రమంలో దీనిపైన పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న డయాబెటిస్ కేసులతో మళ్లీ బార్లీ గింజలకు ప్రజాదరణ పెరుగుతోంది. చాలామంది దాని ఆరోగ్య ప్రయోజనాలను గురించి తెలుసుకుని దానిని నిత్యం ఆహారంలో తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. బార్లీతో బరువుకు చెక్.. ఇంకా ప్రయోజనాలు ఇవే బార్లీ గింజల యొక్క ప్రయోజనాన్ని గురించి ప్రజలలో పెరుగుతున్న అవగాహన చాలామంది అది తమ ఆహారంలో భాగంగా చేసుకోవడానికి ప్రోత్సాహాన్ని అందిస్తుంది. బార్లీ డయాబెటిస్ ను సమర్థవంతంగా నిర్వహించాలి అనుకునే వారికి ప్రధాన ఆహారంగా కూడా మారుతుంది. ఒక డయాబెటిస్ మాత్రమే కాదు బార్లీ మన శరీరానికి కావలసిన తక్షణ శక్తిని అందించి నీరసాన్ని తగ్గిస్తుంది. బార్లీ నీటితో మన శరీరానికి చలువ చేస్తుంది. బార్లీ నీళ్లను ప్రతిరోజు ఉదయం తాగడం వల్ల బరువు తగ్గడానికి కూడా ఇది దోహదం చేస్తుంది.

# డయాబెటిస్ ఉంటే అరటి పండ్లు తినొద్దు అనేది అపోహేనా!

ప్రస్తుత సమాజంలో డయాబెటిస్ పేషెంట్స్ ఎక్కువైపోయారు. డయాబెటిస్ వచ్చింది అంటే ఇది తినకూడదు అది తినకూడదు అన్న రిస్ట్రిక్షన్స్ కూడా ఎక్కువ అయిపోతాయి. మంచి పోషకాలు ఉండే ఆహారం కూడా తినకూడదు అని చెప్పే పరిస్థితి ఉంటుంది. అయితే అటువంటి ఆహారాలలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది అరటిపండు. డయాబెటిస్ బాధితులు అరటిపండు తినొచ్చా అరటిపండులో బోలెడన్ని పోషకాలు ఉంటాయి. అవి మన శరీర ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. అరటి పండులో ఉండే పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు, కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్, ఫైబర్, కొవ్వు వంటి ముఖ్యమైన పోషకాలు మన శరీర ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. అటువంటి అరటి పండ్లను డయాబెటిస్ బాధితులు తినకుండా ఉండాలని చాలామంది చెబుతూ ఉంటారు. డయాబెటిస్ బాధితులు అరటి పండు ఇలా తినొచ్చు డైటీషియన్లు చెబుతున్న దాని ప్రకారం



డయాబెటిస్ బాధితులు అరటిపండు తినకూడదు అనేది ఒక అపోహ మాత్రమే. డయాబెటిస్ బాధితులు ప్రతిరోజు అరటిపండు తినొచ్చు. అయితే అరటి పండు తినడానికి ఒక విధానం అనేది ఉంటుంది. డయాబెటిస్ బాధితులు ప్రతిరోజు ఉదయం వేళల్లో ఒక్క అరటిపండు మాత్రమే తినవచ్చు. ఇందులో సహజ చక్కెర ఎక్కువగా ఉండటం వల్ల, దానిని ప్రోటీన్ మూలంతో కలిపి తీసుకుంటే మరీ మంచిది. ఇలాంటి అరటిపండ్లు తినొద్దు ఇతర ప్రోటీన్ ఆహారాలతో కలిపి ఒక అరటిపండును తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ అసలు పెరగవు. అరటిపండు గ్లైసిమిక్ ఇండెక్స్ 51. ఇందువల్లనే అరటి పండ్లు తింటే త్వరగా షుగర్ పెరుగుతుందని చెబుతారు. అందుకే ఉదయం పూట ఒక అరటిపండును, ప్రోటీన్ ఆహారాలతో కలిపి తీసుకుంటే మంచిది. పొరపాటున కూడా బాగా పండిన అరటి పండ్లను తినకూడదు. అరటిపండు ఈ సమయాల్లో అసలే తినొద్దు అరటి పండు పైన గోధుమ రంగు మచ్చలు ఉన్న అరటి పండ్లను తింటే షుగర్ పెరుగుతుంది. అంతేకాదు అరటిపండును రాత్రి వేళల్లో అస్సలు తినకూడదు. ఉదయం పూట మాత్రమే ఒక్క అరటిపండు మాత్రమే తింటే మంచిది. అరటి పండులో ఉండే పోషకాలు మన శరీరానికి మంచి ఆరోగ్యాన్ని అందిస్తాయి. కనుక షుగర్ పేషెంట్ లు నిరభ్యంతరంగా ఒక్క అరటిపండును ప్రతిరోజు తినవచ్చు. అయితే విపరీతంగా షుగర్ లెవెల్స్ ఉంటే మాత్రం అరటిపండు తినకండి.

# మీ గోళ్లు ఇలా మారితే మీరు డేంజర్ లో ఉన్నట్లే..!




మనం వైద్యుడి వద్దకు వెళ్లినప్పుడు కళ్లు, నాలుక చూసి ఆరోగ్య పరిస్థితుల గురించి చెబుతుంటారు. అలాగే స్టెతస్కోప్ సాయంతో హార్ట్ రేటు చూస్తారు. నాడి వ్యవస్థను పరిశీలిస్తారు. ఇలా ఎలాంటి పరీక్షలు చేయకుండానే మన శరీరంలోకి కొన్ని భాగాలను చూసి ఆరోగ్యాన్ని అంచనా వేస్తుంటారు వైద్యులు. అయితే గోళ్లలో కూడా ఆరోగ్యం దాగి ఉన్నట్లు మీకు తెలుసా..? అవును.. గోళ్ల రంగును బట్టి అనారోగ్యాన్ని తెలుసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. గోళ్లు కెరాటిన్ అనే ప్రోటీన్ తో తయారవుతాయి. ఇవి చేతులు, కాళ్లకు రక్షణ కల్పిస్తాయి. గోళ్ల ఆరోగ్యం మన శరీర ఆరోగ్యానికి సూచికగా చెప్తుంటారు నిపుణులు. గోళ్ల రంగు, ఆకారం, నిర్మాణంలో మార్పులు ఇన్ఫెక్షన్లు, చర్మ వ్యాధులు, మధుమేహం వంటి ఇతర ఆరోగ్య సమస్యలను తెలియజేస్తుందని వివరిస్తున్నారు. గోళ్ల రంగు పూర్తిగా లేదా పాక్షికంగా తెల్లగా ఉంటే అది ఏదైనా గాయం, రక్తహీనత, పోషకాహార లోపం అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇక గోళ్లు చాలా వరకు తెల్లగా ఉండి అంచులు ముదురు రంగులో కన్పిస్తుంటే హెపటైటిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు ఉండే అవకాశం ఉందని వివరిస్తున్నారు. అలాగే గోళ్లు పసుపు రంగులో ఉంటే అది ఇన్ఫెక్షన్ గా భావించవచ్చని అంటున్నారు. చాలా అరుదుగా థైరాయిడ్, మధుమేహం, సోరియాసిస్ వంటి సమస్యలు ఉన్నప్పుడు కూడా గోళ్లు పసుపు రంగులోకి మారతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే గోళ్లలో కనిపించే మార్పులన్నీ శరీరంలోపల అనారోగ్యాలకు సూచనలు కావు. వేళ్లు, చేతులకు గాయాలైనా, ఇన్ఫెక్షన్లు సోకినా ఆ మార్పులు కన్పిస్తాయని చెబుతున్నారు. ఇక నెయిల్స్ ఆరోగ్యంగా ఉండాలంటే.. ప్రోటీన్లు, సిలికా, ఐరన్, జింక్ వంటి పోషకాలు అవసరం అని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# వర్షాకాలంలో విద్యుత్ తో బీ కేర్ ఫుల్.. ఈ తప్పులు చేయొద్దు..!



దేశవ్యాప్తంగా రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో సైతం విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. అయితే ప్రజలు వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. లేదంటే విద్యుత్ ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. వానాకాలంలో చెట్లు విరిగిపోవడం, విద్యుత్తు లైన్లు తెగిపోవడం, ఎక్కడిక్కడ నీరు పేరుకుపోవడం లాంటివి చూస్తుంటాం. ఈ నేపథ్యంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా విద్యుదాఘాతం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచనలు చేస్తున్నారు. ఎర్తింగ్ సరిగ్గా ఉందో లేదో ఎప్పటికప్పుడు చెకింగ్ చేయించుకోవాలని, ఇలా చేయడం వల్ల విద్యుత్ షాక్ ల నుంచి రక్షిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లోని పాత వైర్లు, స్విచ్ బోర్డులు, ప్లగ్ లకు తేమ తగిలితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని అందువల్ల వాటిని మార్పించుకోవడం ఉత్తమం అని చెబుతున్నారు. అలాగే ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులు, ఎలక్ట్రికల్ వస్తువులను తడి చేతులతో తాగొద్దంటున్నారు. ఇక ఫ్రిడ్జ్, కంప్యూటర్, టీవీ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను గోడలకు దూరంగా.. నేలపై నీరు చేరని ప్రదేశంలో అమర్చుకోవాలని వివరిస్తున్నారు. అలాగే ఉతికిన బట్టలను ఇనుప తీగలపై ఆరవేయకూడదు. వాటర్ హీటర్ వాడేటప్పుడు స్విచ్ బంద్ చేసి, ప్లగ్ తీసిన తర్వాతే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టుకోవాలని నిపుణులు వివరిస్తున్నారు. ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువుకు ఎర్త్ తప్పనిసరిగా ఉండాలని.. కరెంట్ లైను కింద ఫోన్ లో మాట్లాడరాదని చెబుతున్నారు. తడిసిన కరెంటు స్తంభాలను, విద్యుత్తు లైన్లకు తగిలే చెట్లను ముట్టుకోకూడదని చెబుతున్నారు. పిల్లలకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు తెగిపోయిన విద్యుత్తు తీగలను తాకరాదని వివరిస్తున్నారు.

# అశ్వగంధ టీ తో రెట్టింపు శక్తి, ఈ సమస్యలు దూరం..!!



అశ్వగంధ. ఆయుర్వేదంలో ఒక శక్తివంతమైన మూలిక. దీనికి ఎంతో చరిత్ర ఉంది. అశ్వగంధలో ఎన్నో ఆరోగ్య పరమైన ప్రయోజనాలు ఉన్నాయి. అనేక వ్యాధులకు ఔధషంగా పనిచేస్తుంది. దీన్ని ఆయుర్వేదంలో పలు ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు. అశ్వగంధను రోజూ ఉపయోగిస్తే అనేక రోగాలు తగ్గిపోతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. అశ్వగంధ మనకు ఆయుర్వేద షాపుల్లో పొడి లేదా ట్యాబ్లెట్ల రూపంలో లభిస్తుంది. టీ, కాఫీలకు బదులుగా అశ్వగంధ టీ ని ఉదయం లేదా సాయంత్రం ఒక కప్పు తీసుకుంటే అనేక ప్రయోజనాలు అందుతాయి. అశ్వగంధ మనకు ఆయుర్వేద షాపుల్లో పొడి లేదా ట్యాబ్లెట్ల రూపంలో లభిస్తుంది. ట్యాబ్లెట్లను డాక్టర్ సూచన మేరకు వాడుకోవాలి. ఇక పొడిని చాలా మంది ఉపయోగిస్తారు. దీన్ని నీటిలో వేసి మరిగించి డికాషన్‌లా తయారు చేసి తాగవచ్చు. అశ్వగంధ టీని రోజూ ఒక కప్పు మోతాదులో తాగడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. ఇందులో ఉండే అడాప్టొజెనిక్ గుణాలు మన శరీరంలో కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తాయి. కార్టిసాల్ అనేది ఒత్తిడిని కలగజేసే హార్మోన్. కనుక అశ్వగంధ టీని తాగితే కార్టిసాల్ లెవల్స్ తగ్గుతాయి. దీంతో ఒత్తిడి మాయమవుతుంది. మానసిక ఆందోళన తగ్గుతుంది. మనస్సు ప్రశాంతంగా మారుతుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. అశ్వగంధ టీని రాత్రి పూట సేవిస్తుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. దీంతో పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్ర చక్కగా పడుతుంది. అశ్వగంధలో ఇమ్యునో మాడ్యులేటింగ్ గుణాలు ఉంటాయి. అందువల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. తెల్ల రక్త కణాలు అధికంగా ఉత్పత్తి అవుతాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాయి. ఏకాగ్రతను మెరుగు పరుస్తుంది. మెదడు చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. మతిమరుపు తగ్గుతుంది. అశ్వగంధలో విథనోలైడ్స్ ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ఈ టీని తాగుతుంటే శరీర శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. అశ్వగంధ మొక్క వేర్లు లభిస్తే వాటిని తెచ్చి ఎండబెట్టి వాటితో మీరు కూడా పొడి తయారు చేసుకుని నిల్వ చేసుకోవచ్చు. ఈ పొడిని నీటిలో వేసి మరిగించి తరువాత వడకట్టి ఆ నీళ్లు గోరువెచ్చగా ఉండగానే అందులో కాస్త తేనె, నిమ్మరసం కలిపి తాగవచ్చు. లేదా నేరుగా అయినా తాగవచ్చు. ఇలా అశ్వగంధ టీని సేవిస్తుంటే అనేక లాభాలను పొందవచ్చుని నిపుణులు చెబుతున్నారు.






# 'ఓజీ'.. పవన్ కళ్యాణ్ ప్లాన్ ఇలా..




టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ఓజీసినిమా రిలీజ్ కు రంగం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ముంబై బ్యాక్ డ్రాప్ తో గ్యాంగ్ స్టర్ డ్రామాగా గ్రాండ్ గా రూపొందుతున్న ఆ సినిమాలో పవన్ పవర్ ఫుల్ రోల్ లో కనిపించనున్నారు. ఓజాస్ గంభీరగా ఓజీలో సందడి చేయనున్నారు. అయితే ఓజీతో పవర్ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంటారని అంతా ఇప్పటికే ఫిక్స్ అయ్యారు. ఎందుకంటే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వేరే లెవెల్ లో హైప్ క్రియేట్ అయ్యి ఉంది. దీంతో పవన్ ఖాతాలో హిట్ పక్కా అని అంటున్నారు. రీసెంట్ గా హరిహర వీరమల్లుతో నిరాశపరిచిన ఆయన.. ఇప్పుడు కంబ్యాక్ ఇస్తారని చెబుతున్నారు. విష్ణు పోస్ట్ చూశారా? అదే సమయంలో వీరమల్లు మూవీకి తనవంతుగా ప్రమోట్ చేసిన ఆయన.. ఇప్పుడు ఓజీ విషయంలో ఏం చేస్తారోనని అంతా మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా సినిమాపై ఇప్పటికే భారీ హైప్ ఉండగా.. పవన్ ప్రమోషన్స్ లో పాల్గొంటే ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పటికే మేకర్స్ తో పవన్ మాట్లాడారట. తాను మూడు రోజుల పాటు సినిమాను ప్రమోట్ చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో మేకర్స్.. ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే మేకర్స్.. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ తో పాటు గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ప్లాన్ చేస్తున్నారు. దీంతో ట్రైలర్ లాంఛ్ కు పవన్ అటెండ్ అవుతారని తెలుస్తోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్ కు డౌటేనని టాక్. అయితే ఆ ఈవెంట్ కు మెగాస్టార్ చిరంజీవి వస్తారని వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో మీడియాకు వరుస ఇంటర్వ్యూలను పవన్ ఇవ్వనున్నారని ప్రచారం జరుగుతోంది. వీరమల్లు టైమ్ లో కూడా అనేక మీడియాలతో మాట్లాడారు. ఇప్పుడు కూడా అలాగే చేయనున్నారని టాక్ వినిపిస్తోంది. కానీ ప్రణాళిక గురించి బయటకు రాలేదు. కాగా, ఓజీ విషయానికొస్తే.. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై డీవీవీ దానయ్య భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. తమన్ మ్యూజిక్ అందిస్తుండగా.. యంగ్ బ్యూటీ ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్నారు. శ్రియా రెడ్డి, అర్జున్ దాస్, సిరి లెళ్ల తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దసరా కానుకగా సెప్టెంబర్ 25వ తేదీన గ్రాండ్ గా రిలీజ్ కానుందీ చిత్రం.



# ఓటీటీలోకి వచ్చేసిన అనుపమ 'పరదా'..

అనుపమ పరమేశ్వరన్.. మలయాళ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న ఈమె.. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన 'అ ఆ' సినిమాతో తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలకరించింది. మొదటి సినిమాతోనే మంచి విజయం అందుకున్న ఈమె.. ఆ తర్వాత 'శతమానం భవతి' సినిమాతో హీరోయిన్ గా నిలదొక్కుకుంది. అదే సమయంలో.. 'రంగస్థలం' లో హీరోయిన్గా అవకాశం ఇచ్చినా కాదనుకుంది అనే రూమర్లను ఎదుర్కొన్న ఈమె.. వీటి కారణంగా ఆరు నెలల పాటు అవకాశాలు కూడా కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఇక అవన్నీ రూమర్స్ అని తనను ఎవరు సంప్రదించలేదని.. ఇటీవల తాను నటించిన పరదా సినిమా ప్రమోషన్స్ లో అసలు నిజం చెప్పింది. సైలెంట్ గా ఓటీటీలోకి వచ్చేసిన అనుపమ పరదా.. ఇకపోతే వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె ప్రస్తుతం 'కిష్కింధపురి' అనే హారర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించిన ఈ సినిమా ఇప్పుడు పాజిటివ్ టాక్ తో దూసుకుపోతోంది. ఇదిలా ఉండగా మరొకవైపు అనుపమ నటించిన మరో చిత్రం 'పరదా'. లేడీ ఓరియంటెడ్ స్టోరీతో వచ్చిన ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేదు. కానీ ఇప్పుడు సైలెంట్ గా ఓటీటీలోకి స్ట్రీమింగ్ కి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్..



అసలు విషయంలోకి వెళ్తే.. ఫిమేల్ సెంట్రిక్ మూవీగా వచ్చిన పరదా తన కెరియర్ లోనే బెస్ట్ మూవీ అని అనుపమ తెలిపింది. అలా ఆగస్టు 22న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా మిక్స్ టాక్ ను సొంతం చేసుకుంది. ఇప్పుడు థియేటర్లోకి వచ్చిన మూడు వారాలలోపే ఓటీటీలోకి రావడం గమనార్హం. అమెజాన్ ప్రైమ్ లో తెలుగు, మలయాళం వెర్షన్లలో స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో ప్రేక్షకులను ఏమాత్రం మెప్పించలేకపోయిన ఈ సినిమా కనీసం ఓటీటీ లోనైనా మెప్పిస్తుందేమో చూడాలి.


# 'లిటిల్ హార్ట్స్' 500ఐ+.. బాబోయ్ ఏంటి ఈ రచ్చ!





: పెద్ద సినిమాలతో కలిసి విడుదలైన చిన్న సినిమా 'లిటిల్ హార్ట్స్'. ఘాటీ, మదరాసి సినిమాల కారణంగా మొదటి రోజు పెద్దగా జనాలు ఈ సినిమా గురించి మాట్లాడిందే లేదు. కానీ ఎప్పుడైతే సినిమా విడుదలై పాజిటివ్ టాక్ మొదలైందో, సోషల్ మీడియాలో సినిమా గురించి మౌత్ టాక్ ప్రారంభం అయిందో వసూళు పెరుగుతూ వచ్చాయి. సినిమాకు చేసిన విభిన్న ప్రచారం కారణంగా పెద్ద సినిమాల మధ్య కూడా సేఫ్గానే రిలీజ్ అయింది. మొదటి రోజు దాదాపుగా రూ. 1.35 కోట్ల వసూళ్లు రాబట్టింది. అంతా కొత్తవారే అయినప్పటికీ ఆ స్థాయి వసూళ్లు రాబట్టడం చాలా గొప్ప విషయం. రెండో రోజు దాదాపుగా డబుల్ వసూళ్లు వచ్చాయి. వీక్ డేస్ అని కూడా వదిలి పెట్టుకుండా చాలా చోట్ల హౌస్ ఫుల్ కావడంతో పాటు, చాలా థియేటర్ లు 80 శాతం కు మించి ఆక్యుపెన్సీ సాధించాయి. మొదటి వారం పూర్తి అయ్యేప్పటికి ఈ సినిమా రూ. 22 కోట్లు రాబట్టిందని చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు.. బుక్ మై షో లో 5 లక్షల టికెట్లు బుక్ తాజాగా ఈ సినిమా బుక్ మై షో ద్వారా ఏకంగా 5 లక్షల టికెట్లు అమ్ముడు పోయాయి అంటూ అధికారికంగా ప్రకటించారు. చిన్న సినిమాకు బుక్ మై షో ద్వారా ఈ స్థాయిలో టికెట్లు బుక్ కావడం అనేది చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. చిన్న సినిమాలకు మంచి టాక్ వచ్చినా థియేటర్ కు వెళ్లి టికెట్లు తీసుకుని సినిమాను చూడటం పరిపాటిగా వస్తూ ఉంటుంది. కానీ లిటిల్ హార్ట్స్ సినిమాకు మాత్రం వారం రోజుల్లోనే కేవలం బుక్ మై షో ద్వారా 5 లక్షల టికెట్లు అమ్ముడు పోయాయి, ఇతర ప్లాట్ ఫామ్ ద్వారా, థియేటర్ విండో వద్ద మరో అయిదు లక్షలు, అంతకు మించి టికెట్లు అమ్ముడు పోయి ఉంటాయి. ఈ రచ్చ చూస్తూ ఉంటే మామూలుగా లేదు అని బాక్సాఫీస్ వర్గాల వారు కూడా బుర్ర గోక్కుంటున్నారట. ఈ లెక్కలు ప్రస్తుతం చిత్ర యూనిట్ సభ్యులకు మరింత బూస్ట్ను ఇస్తున్నాయి. అంతే కాకుండా ప్రేక్షకుల్లో చూడాలనే ఆసక్తిని సైతం రేకెత్తిస్తోంది. కనీసం ఇక్కడైనా మెప్పిస్తుందా? లిటిల్ హార్ట్స్ సినిమాకు రెండో వారంలో మరిన్ని థియేటర్లు ఇది రెండు వారాలు నడిచి పోయే సినిమా కాదని, కనీసం నాలుగు నుంచి ఆరు వారాలు థియేటర్లో ఉండే సినిమా అని నిర్మాతలు, బయ్యర్లు అంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ సినిమాను మరింత మందికి చేరువగా తీసుకు వెళ్లేందుకు గాను కొత్తగా మరికొన్ని థియేటర్లను యాడ్ చేయబోతున్నట్లు బన్నీ వాసు స్వయంగా చెప్పుకొచ్చాడు. మెట్రో నగరాలు, ముఖ్య పట్టణాల్లో ఎక్కువగా విడుదలైన ఈ సినిమా వచ్చే వారం నుంచి చిన్న పట్టణాలకు, మేజర్ గ్రామ పంచాయితీలకు సైతం ఈ సినిమా చేయబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఆడవాళ్లు రిస్క్ తీసుకోవాల్సిందే!

: కెరీర్ గురించి మాట్లాడిన ప్రతీ సారీ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తూ ఉంటారు. సినీ ఇండస్ట్రీలో 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సమంత తాజాగా ఓ వీడియోను షేర్ చేస్తూ ఆ వీడియోలో పలు ఇంట్రెస్టింగ్ విషయాల గురించి ప్రస్తావించారు. సమంత తన కెరీర్లో ఎన్నో సక్సెస్‌లు, ఫెయిల్యూర్లు, కష్టాలు, సవాళ్లు ఎదుర్కొని స్ట్రాంగ్ గా నిలిచారు. స్టార్‌డమ్ పర్మినెంట్ కాదు అయితే తాజాగా సమంత షేర్ చేసిన వీడియోలో తన కెరీర్లో కొత్త ఛాప్టర్ మొదలైందని, ఆ జర్నీ ద్వారా ఇతరులకు స్ఫూర్తిని ఇవ్వాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. స్టార్‌డమ్ అనేది పర్మినెంట్ కాదని, నటీనటుల లైఫ్ లో నేమ్, ఫేమ్ కొంత కాలం మాత్రమే ఉంటాయని, ఒకానొక దశలో ఆడియన్స్ కొత్త మొఖాలను స్వాగతిస్తూ, కొత్త తరహా కథలపై ఇంట్రెస్ట్ చూపిస్తారన్నారు. నా సక్సెస్ ఎంతో మందికి ఆదర్శం ఆ టైమ్ ను గుర్తించి, తమను తామెలా మార్చుకుని, తమ ఎఫెక్ట్ ను సమాజంపై ఎలా చూపిస్తారనేదే అసలైన సక్సెస్ అని సమంత చెప్పారు. ఇండస్ట్రీలో హీరోయిన్ల జర్నీ ఎక్కువ కాలం ఉండదని, అవకాశాలు కూడా చాలా తక్కువగానే వస్తాయని చెప్పిన మాట ఆమె సొంత అనుభవంతో చెప్పినదే. అయినప్పటికీ, తాను అందుకున్న సక్సెస్‌లు ఎంతోమంది ఆదర్శంగా నిలుస్తాయని సమంత చెప్పారు. అలాంటి వాళ్లే సక్సెస్ అవుతారు స్టార్ గా ఉన్నప్పుడు కొందరికి స్ఫూర్తిగా ఉండటం, కనీసం ఒకరికి అయినా



మార్గదర్శకురాలిగా ఉండగలగడం నిజమైన సంతృప్తినిస్తుందని సమంత పేర్కొన్నారు. ప్రతీ మహిళా ధైర్యంగా ముందుకు అడుగు వేయాలని, ఏ విషయంలోనైనా ఎలాంటి భయం లేకుండా రిస్క్ తీసుకునే మహిళలే సక్సెస్ అవుతారని తాను కచ్చితంగా చెప్పగలనని అంటున్నారు సమంత. దూరదృష్టి, కెరీర్ పై ప్లానింగ్ ఉన్న ప్రతీ మహిళా బయటకు వచ్చి తన ఆలోచనలను షేర్ చేసుకోవాలని, ప్రస్తుత ప్రపంచం వారి లీడర్‌షిప్‌నే కోరుకుంటుందని సమంత చెప్పారు. ఓ వైపు సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తూనే మరోవైపు ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పేరిట సొంత బ్యానర్ ను స్థాపించిన సమంత, మొదటి సినిమాగా శుభం ను నిర్మించి మంచి హిట్ ను అందుకున్నారు.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**